




రేపల్లె : ఓలేరుపల్లెపాలెం వద్ద ఇసుకబస్తాలతో పటిష్టపరిచిన కరకట్ట(ఫైల్)



ఓలేరుపల్లెపాలెంవద్ద కృష్ణానది కరకట్టకు గండిపడిన ప్రాంతం (ఫైల్)

వేతన వెతలు



- నీరుగారుతున్న ఉపాధి హామీ పథకం లక్ష్యం
- కూలీల వేతనాలు రూ.51.37 కోట్లు
- మెటీరియల్ బకాయిలు రూ.154.46 కోట్లు
- మూడు నెలలుగా నిలిచిపోయిన చెల్లింపులు
- ఆర్థిక ఇక్కట్లతో కష్టజీవుల ఎదురు చూపు
- బిల్లులు మంజూరు కాక నిలిచిన పనులు
- చోద్యం చూస్తున్న పాలకులు

ఉపాధి వేతనం చెల్లింపులు సకాలంలో జరగడంలేదు. నెలల తరబడి వేతనాలు నిలిచిపోతున్నాయి. చేసిన పనికి సొమ్ములు అందక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. 90 రోజులుగా వేతన చెల్లింపులు నిలిచిపోయాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రూ.51.37 కోట్లు వేతన బకాయిలు పేరుకుపోయాయి. వేతనం ఇప్పించాలన్న కూలీల మొర ఆలకించే నాథుడే కరువయ్యారు. పరిస్థితి తీవ్రంగా ఉన్నా పాలకులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉపాధి కూలీలు చేసిన పనికి వేతనం కోసం పాస్ పుస్తకాలు చేతపట్టుకొని బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతు న్నారు. ఖాతాలు ఖాళీగా కనిపించడంతో నిరాశకు లోన వుతున్నారు. ఉపాధి కార్యాలయాలకు వెళితే.. వేతనం రేపో మాపో బ్యాంకు ఖాతాకు జమ అవుతుందని అధికారులు చెప్పి పంపించేస్తున్నారు. జనవరి 15 నుంచి ఇప్పటి వరకు పనులు చేసిన కూలీలకు ఉపాధి సొమ్ము చెల్లించలేకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. పనులకు సంబంధించిన సామగ్రి బిల్లుల బకా యిలు రూ.154.46 కోట్లు పేరుకుపోయాయి. ప్రతివారం క్షేత్రస్థాయి సిబ్బంది కార్మికుల వారీగా వేతనం వివరాలను మండల కార్యాలయానికి పంపిస్తారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసిన రెండు రోజులకు కూలీల ఖాతాల్లో నగదు జమ చేయాలి. కానీ, మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించట్లేదని ఉపాధి కూలీలు వాపోతున్నారు.

నీరుగారుతున్న ఉపాధి లక్ష్యం

వలసల నివారణకు, వ్యవసాయ, కార్మిక కూలీలకు పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యం అమలులో నీరుగారిపోతోంది. చేసిన పనికి రెండు రోజుల్లో ప్రతి కూలీకి సొమ్ము వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ చేయాలి. అయితే వేతనాలు చెల్లింపుల్లో నిర్లక్ష్యం తాండవిస్తోందని కూలీలు వాపోతున్నారు. వెనువెంటనే కూలి రాకపోవడంతో ఉపాధి పనుల పట్ల కూలీలు ఆసక్తి కనబరచడంలేదు. పల్నాడు జిల్లాలో రూ.19.86 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.8.69 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ 22.82 కోట్లు వేతన బకాయిలు ఉన్నాయి.

విముఖత చూపుతున్న కూలీలు

ప్రభుత్వం ఉపాధి కూలీకి కనీస రోజు వేతనం రూ.307గా నిర్ణయించింది. ఈ మేరకు వేతనం కూలీలకు లభించడంలేదు. వ్యక్తిగత పని దినాలు కల్పించడంలో యంత్రాంగం అలసత్వం వహిస్తుందన్న ఆరోపణలు న్నాయి. పల్నాడు జిల్లాలో అత్యధికంగా 5.77 లక్షల జాబ్ కార్డులు నమోదు చేశారు. గుంటూరు జిల్లాలో 2.09 లక్షలు, బాపట్ల జిల్లాలో 4.72 లక్షల జాబ్ కార్డులున్నాయి. నమోదు చేసుకున్నవారందరూ పనులకు హాజరు కావడంలేదు. పల్నాడులో 4.53 లక్షలు, బాపట్లలో 3.74 లక్షలు, గుంటూరులో 1.51 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. వీరు మాత్రమే ఉపాధి పనులకు హాజరవుతున్నారు. పేరు నమోదు చేసుకుని, పనులకు హాజరు కాని కూలీల సంఖ్యలో లక్షల్లో ఉండటం గమనార్హం. వెనువెంటనే వేతనం చెల్లించి ఆదుకోవాలని ఉపాధి కూలీలు అధికారులను కోరుతున్నారు.

వేసవి భత్యాలు రద్దు

గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసే వారికి ఫిబ్రవరిలో 20శాతం, మార్చిలో 25, ఏప్రిల్‌లో 30 శాతం అదనపు వేతనం ఇచ్చేవారు. మూడేళ్లగా దీనిని తొలగించారు. వీటితో పాటు పార, గడ్డపార, తాగునీరు, మజ్జిగకు సంబంధించి అదనపు భత్యం ఉండేది. గతంలో మాదిరిగా పని ప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు, గాయాలైతే ప్రాథమిక చికిత్స బాక్స్‌లు ఏర్పాటు చేయాలని కూలీలు కోరుతున్నారు. వేసవి భత్యం, సౌకర్యాలు సమకూర్చడంతో పాటు సకాలంలో వేతనం చెల్లిస్తే పనుల్లోకి వచ్చే వేతనదారుల సంఖ్య పెరుగుతుందంటున్నారు.

బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రహదారులు, మురుగు కాల్వలు, పాఠశాలల ప్రహరీల నిర్మాణం పనులు చేపట్టారు. వీటితో పాటు గోకులం షెడ్లు తదితర పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు స్తంభించి పోయాయి. పూర్తయిన పనులకు నెలలు తరబడి బిల్లులు ఆగిపోయాయి. పల్లె పండుగ పథకం ప్రారంభంలో మొదటి రెండు వారాలు బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరిగాయి. అనంతరం చెల్లింపులు నిలిపోవడంతో పనులూ ఆగిపోయాయి. పల్నాడు జిల్లాలో 80.49 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.58.18 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.15.79 కోట్లు బిల్లులు చెల్లించాలి. కమిటీల పర్యవేక్షణలో చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపులు జాప్యం జరుగుతుండటంతో నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- బలహీనంగా కృష్ణానది కరకట్టలు
- ప్రకాశం బ్యారేజీకి దిగువన మరింత ప్రమాదకరం
- ఎగువన పటిష్టతకు రూ. 1100 కోట్ల నిధులు
- వరదలొస్తే దిగువ కరకట్టకు ఎక్కడ గండ్లు పడేనో?
- భయం గుప్పిట్లో కృష్ణా తీర గ్రామాలు
- గతేడాది వరదలకు వణికిపోయిన గ్రామాలు
- రూ. 2 వేల కోట్లతో ప్రతిపాదనలు పంపిన ఆర్‌సీ
- నదీ తీరం వెంబడి ఉన్న నలుగురు మంత్రులపైనే ఆశ

దిగువన దిగులు



కొల్లూరు-ఈపూరు మధ్య సింగిల్ రోడ్డుగా ఉన్న కరకట్ట కోతపడి ప్రమాదకరంగా మారిన చిత్రం

తెనాలి, రేపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి వరదొచ్చిందంటే తీరంలో ప్రకాశం బ్యారేజీకి దిగువన ఉన్న గ్రామాలు వణికి పోతుంటాయి. బ్యారేజీ దిగువన కరకట్ట సీతానగరం నుంచి నది సముద్రంలో కలిసే ప్రదేశం లంకెవానిదిబ్బ వరకు 86 కి.మీటర్లు విస్తరించి ఉంది. కృష్ణా నదికి వరదలు వచ్చినప్పుడు ఈ కరకట్ట వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు ప్రాణాలు గుప్పిట పట్టి బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కృష్ణా ఎగువ భాగాన కుడి కరకట్టను విస్తరించి, నాలుగు లేన్ల రహదారిని నిర్మించేందుకు నిధులు కూడా మంజూరు చేసింది. ప్రకాశం బ్యారేజీ ఎగువన వైకుంఠపురం వరకు ఉన్న కరకట్టలో 7 కి.మీటర్ల దూరాన్ని పటిష్టపరచడంతోపాటు, నదిలో గోడ నిర్మాణం కూడా చేసేలా రూ.1,100 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది.

రూ.2వేల కోట్లతో ఆర్‌సీ ప్రతిపాదనలు

ప్రకాశం బ్యారేజీకి దిగువన కృష్ణానది కరకట్ట పటిష్టతకు ఇంకా మోక్షం లభించలేదు. దిగువ కరకట్టనూ బలపరిచేందుకు ప్రభుత్వానికి నదీ పరివాహక ప్రాంత పరిరక్షణ విభాగం రివర్ కన్జర్వేటరీ(ఆర్.సి) రూ.2వేల కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి తాజాగా పంపింది. ఎగువ కరకట్ట రాజధాని ప్రాంతానికి ఎంత అవసరమో, దిగువన కరకట్టను పటిష్టపరచడం కూడా అంతే అవసరం ఉంది.

కరకట్ట బలహీనం..గండ్లకు అవకాశం

కృష్ణా నదికి వరదలొచ్చినప్పుడు పొరపాటున కరకట్టకు ఎక్కడైనా గండి పడితే ఏంటి పరిస్థితి!..ఈ మాట తలచుకుంటేనే తీర గ్రామాల ప్రజల వెన్నులో వణుకు పుడుతుంది. దీనికి గత ఓలేరు గండి ఉదంతమే నిదర్శనం. వల్లభాపురం వంటి గ్రామాల దగ్గర్లో గండ్లు పడితే దిగువ గ్రామాల్లో జలప్రళయ తప్పదు. 86 కి.మీటర్ల పొడవునా కరకట్ట పటిష్టంగా లేకపోవడంతో గండ్లు పడడానికి అనేకచోట్ల సిద్ధంగా ఉంది. గతంలో మొత్తం కుడి కరకట్టను పటిష్టపరిచి, రోడ్డు నిర్మాణం చేపట్టేలా అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రూ. 119 కోట్లు దీనికోసం కేటాయిస్తే, సీతానగరం నుంచి పెనుమూడి వరకు రూ. 111 కోట్లతో కరకట్టను మట్టితో బలపరచడం, ఉన్న ఎత్తుకంటే మరింత ఎత్తు పెంచడం, కరకట్ట పైభాగం 4 నుంచి 7 అడుగుల వెడల్పు ఉంటే దానిని 12 అడుగులకు పెంచడం వంటి పనులు చేపట్టారు. దీనిపై డబుల్ రోడ్డు కూడా నిర్మాణం చేశారు. అయితే తాడేపల్లి, విజయవాడ క్లబ్ దగ్గర కొంత భాగం, పెదకొండూరు - వల్లభాపురం మధ్య, ఈపూరు-కొల్లూరు, దోనేపూడి-పెదపులివర్రు ప్రాంతాల్లో అసలు కరకట్ట పటిష్టపరచలేదు. కొన్నిచోట్ల భూములు ఇవ్వడానికి రైతులు సమ్మతించకపోవడం, మరికొందరు కోర్టును ఆశ్రయించడంతో ఈ ప్రాంతాల్లో కరకట్ట ఆధునికీకరణ జరగలేదు. దీంతో ఇక్కడ కరకట్ట చిక్కి శల్యమైపోయి ఉంటే, చాలాచోట్ల వర్షాలకు కరకట్ట అంచులు కోతపడిపోయి ఉన్నాయి. ఆధునికీకరణ పనులు జరిగిన చోట్ల కూడా కరకట్ట కుంగిపోయి, గతేడాది వచ్చిన వరదలకు అంచుల వరకు నీరు ప్రవహించి, జనానికి దడ పుట్టించింది.

వెంటాడుతున్న గత పీడకలలు

- కృష్ణా నదికి 2009లో వచ్చిన వరదలకు భట్టిప్రోలు మండలం ఓలేరు దగ్గర కరకట్టకు గండిపడింది. పలు గ్రామాలతోపాటు, రేపల్లె పటణం కూడా వరద నీటిలో చిక్కుకుపోయింది. పట్టణంలోనే పడవలపై ప్రయాణం చెయ్యాల్సి వచ్చింది. గ్రామాల్లో వరద ముంపు వీడడానికి నెలపైనే పట్టింది.
- గతేడాది కృష్ణా నదికి రికార్డు స్థాయిలో 11.36 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించింది. దుగ్గిరాల మండలం పెదకొండూరు నుంచి రేపల్లె మండలం లంకెవాని దిబ్బ వరకు జనం రాత్రులు నిద్రలేకుండా కరకట్టపైనే కాపలకాశారు.
- ఈ వరదలకు వెల్లటూరు-పెనుమూడి మధ్య పలుచోట్ల గండ్లు పడేపరిస్థితి రావడంతో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, అధికారులు రాత్రిళ్లు పొక్లెయినర్ల సాయంతో యుద్ధ ప్రాతిపదికన కరకట్టను పటిష్టం చేశారు. దీంతో గండ్లు పడకుండా పెను ప్రమాదాన్ని ఆపగలిగారు.

'త్రి'కరణ శుద్ధిగా మంత్రులు దృష్టి సారించాలి

ఎగువ కరకట్ట అత్యవసర పనులను ప్రభుత్వం ఆమోదించి, టెండర్లు పిలవడానికి సిద్ధమైంది. కరకట్ట దిగువనున్న నియోజకవర్గాల్లో కేంద్రమంత్రితో పాటు, ముగ్గురు రాష్ట్ర మంత్రులు ఉన్నారు. వీరు తలచుకుంటే నిధుల మంజూరు పెద్ద సమస్యే కాదు. కృష్ణా నది కరకట్ట తాడేపల్లి నుంచి పెదకొండూరు వరకు మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్, అక్కడి నుంచి కొల్లిపర మండలం వరకు మంత్రి నాదెండ్ల మనోహర్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఆ దిగువున మొత్తం రేపల్లె ఎమ్మెల్యే, మంత్రి అనగాని సత్యప్రసాద్ పరిధిలో ఉంది. వీరంతా కీలక మంత్రులే కావడంతో దిగువ కరకట్టకు కూడా ఈ ఏడాదిలో మోక్షం లభిస్తుందన్న ఆశాబావాన్ని నీటిపారుదల శాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు నదిలోనూ గ్రాయిన్స్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీనికోసం కూడా మంత్రులు శ్రద్ధ చూపితే నదీ పరివాహక ప్రాంతం సురక్షితంగా ఉంటుంది.

వేట విరామ భృతి.. రెండు రెట్లు

రూ.20 వేలకు పెంపుదలపై మత్స్యకారుల హర్షం

వైసీపీ హయాంలో గత సంవత్సరం విరామభృతి ఎగవేత

రేపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేట విరామ భృతి రెండు రెట్లైంది. గత ప్రభుత్వం రూ.10 వేలు ఇవ్వగా ఇప్పుడు కూటమి ప్రభుత్వం దానిని రూ.20 వేలకు పెంచింది. దీంతో మత్స్యకారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం నుంచి సముద్రంలో చేపల వేట విరామం ప్రకటించారు. జూన్ 14 వరకు సముద్రంలో చేపల వేటపై నిషేధం అమల్లో ఉంటుంది. ఈ సమయంలో మత్స్యకారుల జీవనోపాధి నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేకంగా భృతి చెల్లిస్తుంటోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఏటా రూ.10 వేలు చెల్లించింది. 2023-24కు సంబంధించిన మత్స్యకారుల భృతి రూ.10 వేలు కూడా ఇవ్వకుండా ఎగ్గొట్టింది. ఈ క్రమంలో గత ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు మత్స్యకారులకు భృతిని పెంచుతామంటూ హామీ ఇచ్చారు. ఈ హామీ అమలులో భాగంగా రెండురోజుల క్రితం జరిగిన క్యాబినెట్ సమావేశంలో భృతిని రూ.20 వేలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మొత్తాన్ని ఈ నెల 26న మత్స్యకారులకు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో ఇప్పటికే జిల్లాలోని నిజాంపట్నంహార్బర్, బాపట్ల, సూర్యలంక, చీరాల, ప్రాంతాల్లో అర్హులైన మత్స్యకారులజాబితాను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

గత ప్రభుత్వంలో అవినీతి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరకొరగానే మత్స్యకారులకు భృతి అందింది. మత్స్యకార భృతి జాబితాల్లో అధికారులు ఇష్టానుసారంగా పేర్లు నమోదు చేశారు. మత్స్యకారుల పేరిట రూ.లక్షలు దోచుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో అర్హులైన భృతి అందలేదని ఉన్నతాధికారులకు పలుమార్లు మత్స్యకారులు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టి అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించి బాధ్యులను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

హార్బర్‌లో నిలిచిన బోట్లు..

వేట విరామంతో హార్బర్‌లో 1000 బోట్లు, ఫైబర్ బోట్లు, ఇంజన్ నావలు, సంప్రదాయ పడవలు జెట్టీలు తీరానికి పరిమితమయ్యాయి. కొత్తపాలెం, నక్షత్రనగర్, రేపల్లె మండలం లంకెవానిదిబ్బ, పెనుమూడి, మోళ్లగుంట, లక్ష్మీపురం గ్రామాల్లో 10 వేల మంది వేట చేసుకుని జీవనాన్ని గడుపుతున్నారు. బాపట్ల, చీరాల ప్రాంతంలో సముద్ర వెంబడి మత్స్యకారులు జీవనం చేసుకునే వారు 16వేలకు పైగానేఉన్నారు. ఒక్కో బోటుకు 8 నుంచి 10 మంది వరకు కళాసీలు పనిచేస్తుంటారు. అన్ని బోట్లలో సుమారు 10వేల మంది వేట చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 40 రోజులుగా వేట నిషేధంతో ఆయా కుటుంబాల జీవనం కనాకష్టంగా ఉంటుంది. ఈ క్రమంలో జీవనభృతికి సంబంధించి ప్రభుత్వం నుంచి శుభవార్త అందడంతో మత్స్యకారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



హార్బర్ జెట్టీ వద్ద నిలిచిన బోట్లు



నిజాంపట్నం హార్బర్‌లో వలలను బాగు చేసుకుంటున్న మత్స్యకారులు

7

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి
- 2న అమరావతికి నరేంద్రమోదీ రాక
- శంకుస్థాపనల కంటే ముందు రోడ్ షో
- పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

రేవులోకి వస్తే.. లేపేస్తాం
- కృష్ణా జిల్లా వాడివి ఎలా వస్తావ్
- గింజుపల్లి రేవులో పడవ పాటదారుడికి బెదిరింపులు
- కలెక్టర్, ఎస్పీ, జడ్పీ అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

హైడ్రో గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు
- రూ.7.5 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

గిన్నిస్ బుక్‌లో కర్లపాలెం విద్యార్థి
- కీబోర్డు ప్లేలో జోయెల్‌విల్సన్ ప్రపంచ రికార్డు

తాగునీటి సమస్యపై ముందస్తు చర్యలు

- కాల్వలకు నీరు విడుదల చేసి చెరువులను నింపాలి
- అధికారులకు ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా శాఖల అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. కేడబ్ల్యూడీ కింద 75 ట్యాంక్‌ల్లో నీటి నిల్వలపై కలెక్టర్ ఆరా తీశారు. ఎస్ఎస్ ట్యాంకులకు సంబంధించి బాపట్ల 33శాతం, రేపల్లె 44శాతం, చీరాల 73శాతం నీటి నిల్వలు ఉన్నాయని కృష్ణాపశ్చిమడెల్టా ఎస్ఈ వెంకటరత్నం కలెక్టర్‌కు తెలిపారు. ఎన్ఎస్పీ పరిధిలోని 40 ట్యాంక్‌ల్లో 45 రోజులకు సరిపడ నీటి నిల్వలు ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు తెలిపారు. బాపట్లలోని సమ్మర్‌స్టోరేజి ట్యాంక్‌లో నీరు వారంరోజుల అవసరాలుకు సరిపోతాయని రేపల్లె సమ్మర్‌స్టోరేజి ట్యాంక్‌లో నీరు నెలరోజులపాటు, చీరాల సమ్మర్‌స్టోరేజి ట్యాంక్‌లో నీరు 120 రోజులపాటు అవసరాలకు సరిపోతాయని మున్సిపల్ కమిషనర్లు కలెక్టర్‌కు తెలిపారు. కృష్ణాపశ్చిమడెల్టా నుంచి బాపట్ల ఎస్ఎస్ ట్యాంక్‌కు నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నీరు బాపట్లకు చేరిన తర్వాత ఎప్పటికప్పుడు ట్యాంక్‌లను నింపాలన్నారు. ఎన్ఎస్పీ కెనల్ నుంచి నీరు విడుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాల్వల ద్వారా నీటిని విడుదల చేసిన తర్వాత ఆ నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వాడాలని సూచించారు. మార్గమధ్యలో నీటిని పొలాలకు వాడకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇందు కోసం ముగ్గురు సభ్యులతో కూడిన టీమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైన పంట పొలాలకు నీరు వాడినట్లు తెలిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కృష్ణాపశ్చిమడెల్టా నుంచి 3,300 క్యూసెక్కులకు 1000 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నందున అవసరమైన చోట మోటర్ల ద్వారా నీటిని తరలించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ విఠలేశ్వర్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆర్డీవో గ్లోరియా, కమిషనర్ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముంచిన అకాల వర్షాలు


- అద్దంకిలో బొప్పాయి, అరటి రైతులకు నష్టాలు
- చినగంజాంలో భారీ వర్షం.. నీటి పాలైన ఉప్పు మడులు

అద్దంకి, చినగంజాం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు రైతులను నిండా ముంచాయి. పంట చేతికి వచ్చే సమయంలో దిగుబడులు నీటి పాల య్యాయి. రెండు రోజుల క్రితం వీచిన గాలులు, వర్షానికి కొంత మేర పంటలు దెబ్బతినగా, బుధవారం వేకువజామున వీచిన గాలులు, వర్షంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల స్తంభాలు విరిగిపడ్డాయి. అద్దంకి, బల్లికురవ, పంగులూరు, కొరిశపాడు మండలాల్లో సుమారు 1500 ఎకరాల మొక్కజొన్న పంట దెబ్బతింది. రైతులకు సుమారు రూ.10 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా. సంతమాగులూరు మండలంలో అరటి తోటలు దెబ్బతిన్నాయి. బొప్పాయి చెట్లు విరిగి కాయలు పూర్తిగా నేలపాలయ్యాయి. అద్దంకి పట్టణంతో పాటు జార్లపాలెం, కలవకూరు తదితర గ్రామాలలో వైట్‌బర్లీ పొగాకు పందిళ్లు పడిపోయి నీరు చేరాయి. అద్దంకిలో సుమారు 61.2 మి.మీ వర్షపాతం నమోదైంది. పంటలు పూర్తిగా దెబ్బతినడంతో ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కాకానిపాలెంలో వైట్‌బర్లీ పొగాకు పందిళ్లలోకి చేరిన వర్షపు నీరు

- చినగంజాం ప్రాంతంలో బుధవారం వేకువజామున ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఉప్పు మడులలో వర్షపు నీరు నిలిచి ఉప్పు పంటకు తీవ్ర నష్టం కలిగింది. మండలంలోని చినగంజాం, సోపిరాల, కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, పెదగంజాం తదితర ప్రాంతాల్లో ఇటీవలనే ఉప్పు మడుల నుంచి ఉప్పు తీయడం ప్రారంభించారు. ఉప్పు బాగా వచ్చే సమయంలో ఇలా వర్షాలు కురువడంతో నష్టాలు చవి చూడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు వెయ్యి ఎకరాల్లో రెండు రోజులలో తీత తీయాల్సిన ఉప్పు సుమారు 50వేల బస్తాల వరకు కరిగి పోయి ఉంటుందని రైతులు తెలిపారు. గొనసపూడి, సంతరావూరు ప్రాంతాల్లో మిరప, పొగాకు పంటలు చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



చినగంజాం ప్రాంతంలోని ఉప్పు కొఠారులలో నిలిచిన వర్షపు నీరు

జేసీ ప్రఖర్‌జైన్ బదిలీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)



బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ బదిలీ అయ్యారు. ఆయనను ఆర్టీజీఎస్ సీఈవోగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తాత్కాలికంగా ఇన్‌చార్జి జేసీని నియమించుకునే అధికారాన్ని కలెక్టర్ వెంకటమురళికి కట్టబెడుతున్నట్లు ప్రభుత్వం ఆదేశాల్లో పేర్కొంది. 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ప్రఖర్‌ను గతేడాది ఆగస్టు చివరివారంలో తొలిపోస్టింగ్‌లో ఇక్కడ జేసీగా నియమితులయ్యారు. ఏడు నెలల పాటు జేసీగా పనిచేసిన ప్రఖర్ వివాదరహితుడిగా, సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్నారు.

గిల్టు నగల మన్నిక కోసం ఇలా చేయాలి..!

మారుతున్న ఫ్యాషన్ ట్రెండ్స్‌కు అనుగుణంగా ప్రస్తుతం రకరకాల గిల్టు నగలు అందుబాటులో ఉన్నాయి. చీర, గౌను, ట్రెండీ డ్రెస్ ఇలా ఏ అవుట్‌ఫిట్ మీదనైనా చక్కగా అమరుతాయి ఈ నగలు. తక్కువ బరువుతో సౌకర్యవంతంగా అనిపిస్తాయి. అందుకే మహిళలు వీటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఎంతో ముచ్చట పడి కొనుక్కున్న గిల్టు నగలను ధరించేటప్పుడు చిన్న చిట్కాలు పాటిస్తూ సరైన పద్ధతిలో భద్ర పరచుకుంటే అవి ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి. ఆ వివరాలు తెలుసుకుందాం...

- గిల్టు నగలకు తడి తగిలితే అవి బంగారు మెరుపును కోల్పోతాయి. అందుకే గొలుసులు, హారాలు, నెక్లెస్‌లు, గాజులు, ఉంగరాలను స్నానం చేసేటప్పుడు తీయడం మంచిది. చేతులు కడుక్కునేటప్పుడు కూడా వాటికి తడి తగలకుండా చూసుకోవాలి.
- మేకప్ ఉత్పత్తులు, మాయిశ్చరైజర్, పర్‌ఫ్యూమ్, లోషన్, డియోడరెంట్‌లు వాడేముందు గిల్టు నగలు ధరించకూడదు. అలా చేస్తే ఈ ఉత్పత్తుల్లోని రసాయనాల వల్ల నగలకు ఉన్న గోల్డ్ ప్లేటింగ్ తొలగిపోయి అవి నల్లబడే అవకాశం ఉంటుంది. మేకప్ పూర్తయి పర్‌ఫ్యూమ్ చల్లుకున్న అయిదు నిమిషాల తరవాతనే గిల్టు నగలు ధరించడం మంచిది.
- వేసవికాలంలో ఎక్కువగా చెమట పట్టే సమయాల్లో ఈ నగలు వేసుకోవద్దు. చెమట తగిలితే నగలు నలుపుతిరుగుతాయి.
- దుస్తులు ధరించిన తరవాతనే నగలు వేసుకోవాలి. లేదంటే దుస్తులకు ఉండే దారాలు, పోగులు పట్టుకుని నగలు విరిగిపోవచ్చు. నగల్లో ఉండే రాళ్లు, పూసలు రాలిపోవచ్చు.



- ఒకసారి ధరించిన నగలను భద్ర పరచేముందు వాటిని వెల్వెట్ వస్త్రం లేదా పలుచని కాటన్ గుడ్డతో మెల్లగా తుడవాలి. నగలకు అంటుకున్న చెమట, దుమ్ము లాంటి వాటిని పూర్తిగా తొలగించాలి. లేదంటే నగలు మెరుపును కోల్పోయి పాత బడతాయి.
- గిల్టు నగలను అన్నింటినీ ఒకే బాక్సులో పెట్టకూడదు. అలా పెడితే ఒకదానికి మరొటి రాసుకుని వాటి మీద గీతలు పడతాయి. మెరుపుదనం తగ్గుతుంది. నగలను వాటికి నిర్దేశించిన బాక్సుల్లో మాత్రమే జాగ్రత్త చేయాలి.
- ఈ నగలను గాలి, వెలుతురు చొరబడని పెట్టి లేదా సంచిలో పెట్టి ఉంచితే ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి. పలుచని గుడ్డలో చుట్టి పెడితే వాటి మెరుపుదనం చాలాకాలం వరకూ నిలిచి ఉంటుంది.

అభిరుచి

**ప్రపంచమంతా చుట్టేయాలని ఎవరికి ఉండదు!
కానీ ఎంతమందికి అది సాధ్యమవుతుంది?
అందుకే ఈ జంట విభిన్నంగా ఆలోచించింది.
పర్యాటక ప్రదేశాల సందర్శన కోసం ఇంటినే వదిలేసింది.
దానికి పెట్టే అద్దె డబ్బులతో... నిరంతరం పర్యటనల్లోనే గడుపుతోంది.
దీని వెనుక ఉన్న కథ ఏంటో జంటలో ఒకరైన హేమని చావ్లా మాటల్లోనే...**

జగమంత కుటీరం మాది



"చదువుకొనే రోజుల్లో మార్కుల రేసులు... పోటీ పరీక్షలు... ఆ తరువాత వృత్తిపరమైన ఎదుగుదల కోసం అలుపెరుగని ప్రయత్నాలు... సగటు మనిషి జీవితం ఇదే కదా. చిన్నప్పటి నుంచీ చూసి చూసి విసుగెత్తిపోయాను. అందరిలా కెరీర్ వెంట పరుగెత్తడం... ఊహ తెలిసినప్పటి నుంచీ దాని కోసమే ప్రణాళికా రచనలో మునిగిపోవడం... డిగ్రీ చదివే రోజుల్లోనే జీవితం అంటే ఇది కాదనిపించింది. ఛత్తీస్‌ఘడ్ రాజధాని రాయ్‌పూర్ మాది. మూస ఉద్యోగాలకు భిన్నంగా చదువు అవ్వగానే ఆర్టేగా కెరీర్ ప్రారంభించాను. అందులో ఊహించినంత కిక్ దొరకలేదు. దాంతో ట్రావెల్ బ్లాగర్‌గా మారాను. తరచూ కొత్త ప్రాంతాలకు వెళ్లడం, అక్కడి ప్రత్యేకతలను సామాజిక మాధ్యమాల్లో అందరితో పంచుకోవడం... చాలా ఉత్సాహంగా, ఉల్లాసంగా అనిపించింది. దాంతో ఆర్టేగా స్వస్తి చెప్పి ట్రావెల్ బ్లాగింగ్‌కు పూర్తి సమయం కేటాయించాలని అనుకున్నాను.

ఆయనదీ అదే దారి...

ఇక నా భర్త సాగర్ పటేల్‌కు కూడా పర్యటనలంటే చాలా ఇష్టం. ఆయన సొంతూరు మధ్యప్రదేశ్‌లోని ఝబువా. భౌగోళిక సమాచార రంగంలో పని చేసేవారు. మా ఇద్దరినీ కలిపింది మా అభిరుచే. ఆయన ఆధ్యాత్మిక పర్యాటకంపై వీడియోలు చేసి ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌ల్లో అప్‌లోడ్ చేసేవారు. నేనేమో పిల్లా పెద్ద అందరూ కలిసి ఆస్వాదించే ప్రాంతాలను చుట్టివచ్చేదాన్ని. అనుకోకుండా ఇద్దరం ఒక ఊరు వెళ్లినప్పుడు కలిశాం. ముందు అభిరుచులు కలిశాయి. తరువాత మనసులు ముడిపడ్డాయి. రెండున్నరేళ్ల కిందట ఇద్దరం పెళ్లి చేసుకున్నాం. అప్పటివరకు విడివిడిగా పర్యటించిన మేము... పెళ్లి తరువాత నుంచి ఎక్కడికైనా కలిసి వెళుతున్నాం. మా వృత్తుల కంటే ఇలా విహరించడమే మాకు బాగా నచ్చింది. అందుకే ట్రావెల్ బ్లాగింగ్‌కే పూర్తి స్థాయి సమయం కేటాయించాలని నిర్ణయించుకున్నాం.

ఇల్లు ఖాళీ చేసి...

అంతకుముందు మేమిద్దరం అహ్మదాబాద్‌లోని ఓ అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. నెలకు అద్దె 40 వేలు. మెయింటెనెన్స్, పని మనిషి, కరెంటు... మరో పది వేలు అయ్యేవి. ఇవి కాకుండా సరుకులు, ఇతర నిత్యావసర వస్తువులు...అన్నీ కలుపుకొంటే దాదాపు లెక్క లక్ష తేలేది. ఇంతా చేసి నెలలో కనీసం ఓ వారం రోజులు కూడా మేం ఇంట్లో ఉండేవాళ్లం కాదు. పెళ్లయ్యాక మొదటి ఏడాదంతా జీవితంలో స్థిరపడాలనే ప్రయత్నాలతోనే సరిపోయింది. దాని కోసం ఎన్నో ప్రణాళికలు. లేచింది మొదలు మెదడులో ఇవే తిరుగుతుండేవి. ఇలాంటి జీవితం కాదు కదా నేను కోరుకున్నది! ఒక రోజు కూర్చొని ఆలోచిస్తుంటే... ఇద్దరి దారి, గమ్యం ఒకటే అయినప్పుడు ఇవన్నీ అవసరమా అనిపించింది. నెల తిరిగే సరికి ఇంత ఖర్చు భరించడం అంటే... తెలియకుండానే మాపై ఆర్థికంగా, మానసికంగా ఒత్తిడి పెరుగుతోంది. దీనివల్ల చేసే పని మీద ఏకాగ్రత కుదరడం లేదు. అన్నీ బేరీజు వేసుకున్నాక... ఇల్లు ఖాళీ చేయాలనే నిర్ణయానికి వచ్చాం. మాకున్న కొద్దిపాటి సామాను అత్తగారి ఇంట్లో పెట్టాం.

అద్దె డబ్బుతో...

ఇకపై పూర్తిగా పర్యటనల్లోనే గడపాలని ఇద్దరం అనుకున్నాం. అలా ఐదు నెలల కిందట ఇల్లు ఖాళీ చేసేశాం. అప్పటి నుంచి నిరంతరాయంగా ఊళ్లు తిరుగుతున్నాం. ఇప్పుడు మాకంటూ ఒక ఇల్లు లేదు. మేం ఎక్కడికి వెళితే అక్కడే మా నివాసం. ఎలాంటి బరువు, బాధ్యతలూ లేవు. నెల నెలా మేం కట్టే అద్దె డబ్బులతో నచ్చిన ప్రాంతాలన్నీ సందర్శిస్తున్నాం. 'మేం ఇలా గడపాలనుకున్నాం' అని మా పెద్దవాళ్లను కూడా ఒప్పించాం. అప్పుడప్పుడూ వారిని కూడా మాతో తీసుకువెళుతుంటాం. కొన్ని ఊళ్లకు తరచూ వెళుతుండంవల్ల స్థానికులతో పరిచయాలు ఏర్పడ్డాయి. దానివల్ల కొన్నిసార్లు కొత్త ప్రాంతానికి వెళ్లిన అనుభూతి కలగదు. అంతా మనవాళ్లే అనిపిస్తుంది. అలాగే బయటివారి కంటే తక్కువ ధరకే వసతి దొరుకుతోంది. మా ప్రయాణ ఖర్చులు, అక్కడి హోటల్‌లో బస, భోజనం... అన్నీ కలుపుకొంటే మేం కట్టిన అద్దె డబ్బు కంటే మించడంలేదు. సరుకులు కొనాల్సిన అవసరం లేదు. ఇద్దరికీ కలిపి ఒక సూట్‌కేస్, ఒక బ్యాక్‌ప్యాక్. ఇదే మా సంసారం.

లక్షల్లో ఫాలోవర్స్...

ప్రస్తుతం మేం తీసే వీడియోలన్నీ నా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తున్నాం. అక్కడ నాకు దాదాపు మూడున్నర లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ట్రావెల్ బ్లాగింగ్‌ను ఫుల్‌టైమ్ కెరీర్‌గా మార్చుకున్నాక ఫాలోవర్స్ విపరీతంగా పెరిగారు. మా ఆలోచనకు అభినందనలు తెలుపుతున్నారు. 'మీది సాహసోపేత నిర్ణయం' అంటూ పొగుడుతున్నారు. ఆ కామెంట్లు చూసినప్పుడు... 'ఇల్లు, కెరీర్‌ను వదిలేసి కొత్త మార్గంలో పయనిస్తున్నామంటే... నిజంగానే మాది సాహసమే కదా' అనిపిస్తుంది. అయితే జీవితం మొత్తాన్నీ ఒక సూట్‌కేసులో పెట్టేసి జీవించడమంటే అంత సులువు కాదు. కానీ ఒక్కటి నిజం... లగేజీ ఎంత తక్కువ ఉంటే ప్రయాణం అంత సౌకర్యంగా ఉంటుంది. ఏదిఏమైనా మా పర్యాటక అభిరుచిని జీవితాంతం కొనసాగించాలన్నదే మా ధ్యేయం. ఎందుకంటే ఇలాంటి అద్భుత అవకాశం అందరికీ రాదు కదా."

ప్రయోగాత్మకంగా...



మేం మొదలుపెట్టినప్పుడు ఎన్ని రోజులు కొనసాగిస్తామో తెలియదు. ప్రయోగాత్మకంగా ఏడాది పాటు ఇలా చేసి చూద్దామని అనుకున్నాం. ఐదు నెలలు గడిచిపోయాయి. రోజు రోజుకూ ఉత్సాహం, ఆసక్తి పెరుగుతున్నాయే కానీ తగ్గడంలేదు. కుదిరితే జీవితాంతం ఇలా పర్యటనల్లోనే గడిపేయాలని కోరుకొంటున్నాం. పర్యటిస్తూనే మేం సంపాదించుకొంటున్నాం. వెళ్లదలుచుకున్న చోట రెస్టారెంట్లు, దర్శనీయ స్థలాల నిర్వాహకులను సంప్రతిస్తాం. వారు కోరితే వాటికి ప్రచారం కల్పిస్తాం. వారి సామాజిక మాధ్యమాల ఖాతాలను నిర్వహిస్తాం. సాంకేతికంగా మాకు మంచి నైపుణ్యం ఉంది. ఈ సేవలకు గానూ వారు మాకు కొంత మొత్తం చెల్లిస్తారు. రెస్టారెంట్లు, కేఫ్‌ల్లో తాత్కాలికంగా హెల్పర్‌గా పని చేస్తాం. ఇవే మా ఆదాయ మార్గాలు.



ఆరాధ్యుల వెంకటేశ్వరరావు, గుర్రాల రవికృష్ణలకు పురస్కారాలు అందజేస్తున్న మంత్రి దుర్గేశ్

సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరిస్తాం

- సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేశ్
- నాటక రంగంలో 113 మందికి 'కందుకూరి' పురస్కారాలు

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కళలు, సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరిస్తామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. కందుకూరి 177వ జయంతి సందర్భంగా ఏపీ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం 'తెలుగు నాటక రంగ దినోత్సవం-2025' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గేశ్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో నాటకానికి ఓ ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించి, నాటకానికి సామాజిక ప్రయోజనం ఉండాలని విశ్వసించిన రచయిత వీరేశలింగం పంతులు అని కొనియాడారు. తెలుగులో మొట్టమొదటి నాటకం రాసిన కందుకూరిని నాటకరంగ ఆద్యుడుగా అభివర్ణించారు. నాటక రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 113 మందికి మంత్రి అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. రాష్ట్రస్థాయిలో ముగ్గురికి కందుకూరి ప్రతిష్ఠాత్మక రంగస్థల పురస్కారాలు, జిల్లాస్థాయిలో 110 మందికి కందుకూరి విశిష్ట పురస్కారాలను అందజేశారు.

సచివాలయం, ఐకానిక్ టవర్ల నిర్మాణానికి టెండర్లు

- మే 1న టెక్నికల్ బిడ్లను తెరవనున్న సీఆర్డీఏ

విజయవాడ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అమరావతిలో నిర్మించతలపెట్టిన సచివాలయం, జీఏడీ ఐకానిక్ టవర్ల నిర్మాణానికి సీఆర్డీఏ టెండర్లు పిలిచింది. సచివాలయం కోసం 4 టవర్లు, జీఏడీ టవర్‌కు వేర్వేరుగా టెండర్ నోటిఫికేషన్లు ఇచ్చింది. మొత్తంగా రూ.4,668 కోట్లతో 5 టవర్లను డయాగ్రిడ్ మోడల్‌లో నిర్మించనున్నారు. సచివాలయ 4 టవర్లను బేస్‌మెంట్+39 ఫ్లోర్లు+టెర్రస్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో 1, 2 టవర్లను 28,41,675 చదరపు అడుగుల విస్తీర్ణం, 3, 4 టవర్లను 23,42,956 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించనున్నారు. సీఎం కార్యాలయం ఉండే కీలకమైన జీఏడీ టవర్‌ను బేస్‌మెంట్+47 ఫ్లోర్లు+హెలిప్యాడ్‌తో కలిపి మొత్తం 17,00,3000 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. జీఏడీ టవర్ నిర్మాణానికి రూ.1,126 కోట్లు, సచివాలయం ఒకటి, రెండు టవర్ల నిర్మాణానికి రూ.1,897 కోట్లు, సచివాలయం టవర్ల కోసం రూ.1,664 కోట్లతో వేర్వేరుగా టెండర్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. మే 1వ తేదీన సచివాలయం, జీఏడీ టవర్ల టెక్నికల్ బిడ్లను సీఆర్డీఏ తెరవనుంది.

పవన్ కల్యాణ్, మార్క్ శంకర్‌పై అసభ్య పోస్టులు
పోలీసుల అదుపులో కర్నూలు జిల్లా వాసి

- నిందితుడు అల్లు అర్జున్ అభిమానిగా గుర్తింపు

గుంటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన కుమారుడు మార్క్ శంకర్‌పై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన కేసులో కర్నూలు జిల్లా గూడూరుకు చెందిన పుట్టపాశం రఘు అలియాస్ పుష్పరాజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు.. ప్రత్తిపాడుకి చెందిన సాంబశివరావు ఫిర్యాదు మేరకు రఘుని రెస్టు చేశామన్నారు. రఘు.. అల్లు అర్జున్‌కు వీరాభిమాని అని తెలిపారు. 2024 ఎన్నికల సమయంలో అర్జున్ నంద్యాలకు వచ్చి వైసీపీ అభ్యర్థికి మద్దతు తెలిపారు. దీంతో మెగా అభిమానులు అర్జున్‌ని విమర్శించారు. దీంతో రఘు.. మెగా కుటుంబంలోని వ్యక్తులపై అసభ్యకర పోస్టులు పెట్టేవాడని ఎస్పీ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 8న పవన్ కల్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్‌కు సింగపూర్‌లో అగ్ని ప్రమాదం జరిగిందని, ఇదే అదునుగా మెగా కుటుంబంపై ద్వేషాన్ని వెళ్లగక్కుతూ అనుచిత వ్యాఖ్యలు పోస్టు చేశాడని తెలిపారు.

విశాఖ కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ పనులు ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారయ్యాయి. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేయడం ఒడిశాలోని తూర్పు కోస్తా జోన్ అధికారులకు ఆది నుంచీ ఇష్టం లేదు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా ఆ రాష్ట్రానికి చెందిన వారే కావడంతో వారు అనుకున్నట్టుగానే చేస్తున్నారు. దీంతో గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు.



ఒడిశా అధికారుల మోకాలడ్డు
- కొత్తవలసను కూడా రాయగడ
- డివిజన్‌లో చేర్చాలని డిమాండ్
- మళ్లీ ఆగిన జోనల్ ఆఫీస్ పనులు
- ఉమ్మడి జిల్లాలో రైల్వే స్టాండింగ్
- కమిటీ చైర్మన్ ఉన్నా ప్రయోజనం నిల్

విశాఖ రైల్వే జోన్‌కు గెజిట్ ఏదీ?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ రైల్వే జోన్ ప్రకటించిన తర్వాత విశాఖలో కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి ఏళ్ల సమయం పట్టింది. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడ్డాక రైల్వే జోన్‌కు అవసరమైన భూ వివాదాలు పరిష్కరించి అధికారికంగా ముడసర్లోవలో 52 ఎకరాలు అప్పగించింది. దీనిలో కార్యాలయ సముదాయం నిర్మాణానికి ఈ ఏడాది జనవరి 8న ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. రైల్వే జోన్ భవన నిర్మాణానికి రూ.149 కోట్లతో టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్ అక్కడ పనులు ప్రారంభించగా వివాదాలు మొదలయ్యాయి. ఆ భూమి తమదంటూ కొందరు గిరిజనులు పనులను అడ్డుకున్నారు. దీంతో ఎక్కడి యంత్రాలు అక్కడే ఆగిపోయాయి. వైసీపీ హయాంలోనూ గిరిజనులు ఇలాగే అడ్డుపడ్డారు. వారికి ఆ భూములపై హక్కులు లేవని అధికారులు నిర్ధారించారు. అయితే, తాము చాలా కాలంగా ఇక్కడే జీవిస్తున్నామని, ప్రత్యామ్నాయం చూపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సొంత భవనంతో సంబంధం లేకుండా రైల్వే జోన్‌ను ఆపరేషన్ చేసుకునే అవకాశం ఉంది. వాస్తవానికి రైల్వేలో ఏదైనా కొత్త జోన్ ఏర్పాటు చేసినప్పుడు దానికి సంబంధించి అధికారికంగా ఒక గెజిట్ విడుదల చేస్తా రు. దీనిలో న్యాయపరమైన అంశాలు ఉంటాయి. జోన్ పరిధి, హద్దులు, ఆపరేషన్ తేదీ, తదితర వివరాలు పేర్కొంటారు. గతంలో అన్ని జోన్లకు గెజిట్ ప్రకటించాకే పనులు ప్రారంభించారు. విచిత్రంగా విశాఖలోని దక్షిణ కోస్తా జోన్‌కు మాత్రం ఇప్పటివరకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదు. 3 నెలలైనా దాని గురించి ఎవరూ ప్రశ్నించడం లేదు. జోనల్ కొత్త కార్యాలయం నిర్మాణం రెండేళ్లలో పూర్తిచేయాలని నిబంధన పెట్టారు. కానీ, మూడు నెలలైనా అక్కడ మొక్కలు కూడా తొలగించలేదు. గెజిట్‌లో 'ఆపరేషన్ డేట్' ప్రకటిస్తే దాని ప్రకారం రైల్వే అధికారులు పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ, ఉద్దేశపూర్వకంగా గెజిట్ ప్రకటించకుండా తొక్కిపెట్టారు.

కొత్తవలస కావాలని పేచీ

దక్షిణ కోస్తా జోన్ ప్రకటించిన సందర్భంలో వాల్తేరు డివిజన్‌ను విడగొట్టి కొత్తగా ఒడిశాలోని రాయగడ కేంద్రంగా మరో డివిజన్ ఏర్పాటు చేశారు. విజయనగరం జిల్లా కొత్తవలస నుంచి అరకు వరకు రాయగడ డివిజన్‌లో చేర్చారు. అయితే, తాజాగా కొత్తవలస స్టేషన్‌ను కూడా ఈ డివిజన్‌కే ఇవ్వాలని తూర్పు కోస్తా జోన్ అధికారులు భువనేశ్వర్ నుంచి ఒత్తిడి చేస్తున్నారు. దీనికి బలమైన కారణం ఉందన్న చర్చ సాగుతోంది. ఆ పరిసరాల్లో రైల్వే వ్యాగన్ డిపో త్వరలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దీంతో కొత్తవలస స్టేషన్ కూడా తమ పరిధిలో చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. అదయ్యాకే గెజిట్‌ను విడుదల చేయించాలనేది ఒడిశా నేతల ప్రణాళికగా ఉన్నట్టు సమాచారం.

మన నేతలు ఏం చేస్తున్నట్టు?

రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేసేశాం కాబట్టి తమ పని అయిపోయిందని ఉత్తరాంధ్రకు చెందిన నాయకులు భావిస్తున్నారు. అనకాపల్లి ఎంపీగా ఉన్న సీఎం రమేశ్ సాక్షాత్తూ రైల్వే స్టాండింగ్ కమిటీకి చైర్మన్. ఆయన దీనిపై దృష్టి పెడితే రెండు రోజుల్లో గెజిట్ నోటిఫికేషన్ ఇప్పించే అవకాశం ఉంది. ఉత్తరాంధ్రాలోనే కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఉన్నారు. ఆయన ఢిల్లీ పెద్దలతో మాట్లాడినా గెజిట్ విడుదల అవుతుంది. ఆ దిశగా దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

లైవ్‌లో అశ్లీల వీడియోలు

- నిషేధిత వెబ్‌సైట్‌కు అమ్ముతున్న ముఠా
- బెంగళూరు కేంద్రంగా ఇద్దరు.. గుంతకల్లులో మరొకరు దందా
- పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్న ఈగల్ చీఫ్ రవికృష్ణ

గుంటూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నిషేధిత అశ్లీల వెబ్‌సైట్‌లో మహిళల నగ్న వీడియోలు ప్రత్యక్ష ప్రసారం చేస్తూ సొమ్ము చేసుకుంటున్న ముగ్గురి గుట్టురట్టయింది. రెండేళ్లుగా ఈ అశ్లీల దందా నిర్వహిస్తున్న శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన గణేశ్, జ్యోత్స్న, గుంతకల్లుకు చెందిన లూయిస్‌లను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం వారిని మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. వారి దందా వివరాలను ఈగల్ చీఫ్, సైబర్ క్రైమ్ ఇన్‌చార్జ్ ఐజీ ఆకే రవికృష్ణ గుంటూరులోని సీఐడీ కార్యాలయంలో వివరించారు. గణేశ్, జ్యోత్స్న డిగ్రీ చదువుకొని సులువుగా డబ్బు సంపాదించే మార్గాలను అన్వేషించారు. బెంగళూరు కేంద్రంగా సైప్రస్ దేశానికి చెందిన నిషేధిత ఎక్స్‌హ్యామ్‌స్టర్ వెబ్‌సైట్ ద్వారా మహిళల నగ్న వీడియోలను లైవ్ స్ట్రీమింగ్ చేస్తున్నారు. గుంతకల్లులో కాల్ సెంటర్ నిర్వహిస్తున్న లూయిస్ అనే వ్యక్తి కూడా ఈ అశ్లీల వీడియోల దందా నిర్వహిస్తున్నాడు. ఈ ముగ్గురికి వెబ్‌సైట్ నిర్వాహకులు క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్‌లో చెల్లింపులు చేస్తే.. వాటిని డాలర్లలోకి, ఆపై రూపాయల్లోకి మార్చుకుంటున్నారు. ఇప్పటి వరకు బెంగళూరుకు చెందిన ముఠా రూ. 16 లక్షలు, లూయిస్ రూ. 11 లక్షలు సంపాదించారని పోలీసుల విచారణలో తేలింది. తమకు అందిన సమాచారం మేరకు సీఐడీ సైబర్ క్రైమ్ ఎస్పీ కృష్ణ ప్రసన్న ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బెంగళూరులోని గణేశ్, జ్యోత్స్న స్టూడియోపై దాడి చేసి లైవ్ స్ట్రీమింగ్ పరికరాలు, వెబ్ కెమెరాలు, పోర్న్ వీడియోల డేటా సీజ్ చేశారు. ఇక్కడ ప్రస్తుతానికి ముగ్గురు మహిళా బాధితులను గుర్తించారు. ఈ ముఠాపై ఇప్పటివరకు మూడు ఫిర్యాదులు నమోదయ్యాయని, దర్యాప్తు కొనసాగుతోందని, ఎంత మంది బాధితులు ఉన్నారనేది త్వరలోనే తెలియజేస్తామని ఐజీ ఆకే రవికృష్ణ తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సైబర్ క్రైమ్ బాధితులు 1930కు ఫిర్యాదు చేయొచ్చు

ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆకే రవికృష్ణ సూచించారు. ఇటీవల బెట్టింగ్ యాప్స్, డిజిటల్ అరెస్టులు, ఓటీపీ ఫ్రాడ్ తదితర ఆర్థిక నేరాలు జరుగుతున్నాయన్నారు. అందువల్ల వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు సంబంధించి 1930 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. న్యాయం జరగని పక్షంలో మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయానికి రావచ్చన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టు పెడితే పదేళ్ల తరువాత అయినా అరెస్టు కాక తప్పదని హెచ్చరించారు. యువత డ్రగ్స్, గంజాయి వంటి మాదక పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాటిపై ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా 1972 అనే టోల్ ఫ్రీ నంబర్ ఉందన్నారు. ప్రిస్కిప్షన్ లేకుండా మత్తు మందులను విక్రయించవద్దని మందుల షాపులకు సూచించారు. తల్లిదండ్రులూ పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సమావేశంలో ఎస్పీ కృష్ణ ప్రసన్న, డీఎస్పీ గోలి లక్ష్మయ్య పాల్గొన్నారు.

మూడేళ్లలో ఏపీ పోలీసుల్లో 33% మహిళలు



- మిగతా రాష్ట్రాలు 24 ఏళ్లకు గానీ కోటా చేరుకోలేవు
- ఇండియా జస్టిస్ నివేదిక-2025 వెల్లడి

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పోలీసు వ్యవస్థలో మహిళా రిజర్వేషన్ కోటా 33 శాతాన్ని ఇప్పటి వరకు ఏ రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతం కూడా సాధించలేదని ఇండియా జస్టిస్ నివేదిక-2025 వెల్లడించింది. మరో మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో 33 శాతానికి చేరుకుంటుందని తెలిపింది. అదే సమయంలో మిగతా రాష్ట్రాలు ఈ కోటాను పూర్తిగా అమలు చేయడానికి కనీసం మరో 24 ఏళ్లు అవుతుందని, జార్ఖండ్, త్రిపుర, అండమాన్-నికోబార్‌కు అయితే 200 ఏళ్లు పడుతుందని పేర్కొంది.

నివేదికలోని వివరాలు

- దేశవ్యాప్తంగా 17 శాతం పోలీసు స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు, 30 శాతం స్టేషన్లలో మహిళా హెల్ప్ డెస్కులు లేవు.
- పోలీసు వ్యవస్థలో లింగ వివక్ష అధికంగా ఉంది. దేశవ్యాప్తంగా ఉన్నత స్థాయి పోస్టుల్లో ఉన్న మహిళలు 8 శాతం మాత్రమే. ఏపీలో జాతీయ సగటు కంటే కూడా తక్కువగా ఉంది. ఏపీలో సగటున పోలీసు స్టేషన్‌కు మహిళా ఎస్‌ఐలు 0.2 శాతం, మహిళా కానిస్టేబుళ్ల 2.5 శాతం మాత్రమే.
- ఏపీలో మొత్తం పోలీసు ఉద్యోగుల్లో మహిళలు 21.5 శాతం, పోలీసు అధికారుల్లో 5.2 శాతం, జైలు ఉద్యోగుల్లో 8.4 శాతం ఉన్నారు.
- న్యాయవ్యవస్థలో పెండింగ్ కేసుల సంఖ్య ఎక్కువగా ఉంది. బిహార్‌లో మూడేళ్ల నుంచి పెండింగ్ కేసులు 71 శాతం ఉన్నాయి.
- ఏపీలో కింది కోర్టుల్లో మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులు 33.5 శాతం. హైకోర్టులో ఐదేళ్ల నుంచి పెండింగ్ కేసులు 50.7 శాతం, 10-20 ఏళ్లలో పెండింగ్‌లో ఉన్నవి 26.7 శాతం, 20 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నవి 22.5 శాతం ఉన్నాయి.
- 10 లక్షల మంది ప్రజలకు 50 మంది జడ్జిలు అవసరం కాగా, ప్రస్తుతం 15 మంది జడ్జిలు మాత్రమే ఉన్నారు. ఏపీలో జడ్జి, ప్రజల నిష్పత్తి 10.5 శాతంగా ఉంది. ఇది 50 శాతం ఉండాలి.
- జిల్లా న్యాయస్థానాల్లో మహిళా జడ్జిలు 38 శాతం ఉన్నారు.
- ఏపీ హైకోర్టు జడ్జిల్లో మహిళలు 16.7 శాతం, సబ్ కోర్టుల్లో 50.9 శాతం ఉన్నారు.
- పోలీసు, న్యాయ వ్యవస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటాను అమలు చేసిన ఏకైక రాష్ట్రం కర్ణాటక.
- దేశవ్యాప్తంగా మహిళా పోలీసుల్లో 89 శాతం మంది కానిస్టేబుల్ స్థాయిలోనే ఉన్నారు.

ఆర్గానిక్ పంటలకు ప్రోత్సాహం

● ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ దేవదత్



సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ దేవదత్, చిత్రంలో డైరెక్టర్ డాక్టర్ యడ్లపల్లి సతీష్ తదితరులు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో ఆర్గానిక్ పంటలు పండించే వారికే మాత్రమే ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహకాలు అందజేస్తుందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్ తెలిపారు. బుధవారం గుంటూరు లాం ఫాంలోని కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఆయన ప్రసంగించారు. మొత్తం సాగు భూమిలో 35శాతం ఆర్గానిక్ పంటలు మాత్రమే పండించేలా లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్లాలన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని క్రిమిసంహారక మందులు లేని పంటల సాగుకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు తెలిపారు. మేలైన వ్యవసాయ పద్ధతుల ద్వారా రాష్ట్రంలో 1,977 మంది రైతులు 1,594 హెక్టార్ల విస్తీర్ణంలో పండించిన 5,549 మెట్రిక్ టన్నులు ఉత్పత్తులను అధిక ధరకు విక్రయించి లబ్ధి పొందారన్నారు. సమీక్షలో డైరెక్టర్ డాక్టర్ యడ్లపల్లి సతీష్, క్వాలిటీ మేనేజర్ డాక్టర్ యుగంధర్, జోనల్ ఆఫీసర్లు డాక్టర్ సారిక, డాక్టర్ మూల ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ సదుపాయాలను కల్పించాలి

● వీఏవోల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ముత్తినేని నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎం.నాగేశ్వరరావు, పాల్గొన్న సంఘ సభ్యులు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గతంలో ఉన్న సవరణ ఉత్తర్వులను రద్దు చేసి, వీఏవోలు అందరికీ పెన్షన్లు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ విశ్రాంత సంఘం, విశ్రాంత ఉద్యోగుల విభాగపు రాష్ట్ర అధ్యక్షుడు ముత్తినేని నాగేశ్వరరావు తెలిపారు. గుంటూరు, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో బుధవారం సంఘ కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. పదేళ్ల సర్వీసు ఉన్న వారికి సర్వీసు పెన్షన్, ఇతర సదుపాయాలను కల్పించాలని 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జీవోను జారీ చేసిందన్నారు. కాకపోతే పార్టటైమ్ సర్వీస్, వాలంటరీ పదవి విరమణకు పనికిరాదని కొందరు అభ్యంతరం తెలుపుతూ ఆ జీవోను అమలు జరపకుండా నిలిపివేశారని గుర్తుచేశారు. జీవోను అమలు చేయాలని ఎనిమిది ఏళ్ల నుంచి న్యాయపోరాటం చేస్తున్నామని తెలిపారు. కౌంటర్లు దాఖలు చేయాలని కోరుతూ ఈ మధ్య సీఎస్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టి సారించి, న్యాయ పోరాటానికి సహకరించి, పెన్షన్ సదుపాయాలను కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల రామదాసు, కోశాధికారి వాన కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

● 2న అమరావతికి నరేంద్రమోదీ రాక

● శంకుస్థాపనల కంటే ముందు రోడ్ షో

● పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లుకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం



కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

గుంటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2న రాజధాని అమరావతిలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోదీ రాజధానిలో వివిధ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొననున్న దృష్ట్యా అందుకు తగిన ఏర్పాట్లను అధికారులు శ్రద్ధపెట్టి చేయాలన్నారు. ప్రధాని బహిరంగ సభలో పాల్గొనే ముందు రోడ్డు షో ఉంటుందని, అందుకు తగ్గ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి రూట్ ప్లాన్‌పై అధికారులందరు కూడా అవగాహన కలిగి ఉండి వాహనాల రాకపోకలు, ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. బ్యారికేడ్ పనులు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ సతీష్‌కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ సంజనసింహా, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో ఖాజావలి, ఏఎస్పీ సుప్రజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, డ్వామా పీడీ శంకర్, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీఈవో రేణుక, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, ఉద్యాన శాఖ అధికారి రవీంద్ర, గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, డీఏవో వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ ప్రసాద్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి వీరాచారి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, డీఈవో రేణుక తదితరులు

ఉప్పలపాడు జడ్పీ స్కూల్ విద్యార్థినికి వెయిట్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్

గుంటూరు(విద్య), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉప్పలపాడులోని జడ్పీ స్కూల్ విద్యార్థి జాతీయ స్థాయిలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చూపింది. ఈనెల 7వ తేదీ నుండి 12వరకు మణిపూర్‌లోని ఇంఫాల్‌నందు జరిగిన జాతీయ స్థాయి అండర్-17 విభాగంలో 76 కేజీల విభాగం వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఉప్పలపాడు జడ్పీ స్కూల్ విద్యార్థిని బిత్రా రోచిస్మతి కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆమెను అభినందించారు. కార్యక్రమంలో డీఈవో రేణుక, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మెల్లంపూడి రవి ఉప్పలపాడు పీడీ సీహెచ్ వినయ్‌కుమార్, రాష్ట్ర పీడీ పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కరీముల్లారావు, జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీను, కోచ్, పీడీ శిరీష తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలి

● నోబుల్ టీచర్స్ అసోసియేషన్



పార్వతికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ నాయకులు

గుంటూరు (విద్య), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ కేడర్లలో జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావులు విజ్ఞప్తిచేశారు. ఈమేరకు బుధవారం పాఠశాల విద్య డైరెక్టర్ పి. పార్వతికి వినతిపత్రం అందజేశారు. కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయులు వారి కుటుంబాలకు దూరంగా ఉన్నారని, వెంటనే వేసవి సెలవులలో బదిలీలు చేపట్టాలని కోరారు. అలాగే మోడల్ స్కూల్స్‌లో పనిచేయుచున్న ఉపాధ్యాయులకు ఈ వేసవి సెలవులలో బదిలీలు చేపట్టాలని హైమారావు తదితరులు కోరారు.

జిల్లాకు 28 ఆధార్ కిట్ల మంజూరు

● డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ



సచివాలయాల సిబ్బందికి ఆధార్ కిట్లు అందజేస్తున్న డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ, మోహన్‌రెడ్డి తదితరులు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆధార్‌సేవలు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం గుంటూరు జిల్లాకు 28 ఆధార్‌కిట్లు మంజూరుచేసిందని జడ్పీ డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ తెలిపారు. ఒక్కో కిట్ విలువ రూ.1.80లక్షలు ఉంటుందన్నారు. ప్రతి కిట్‌లో ల్యాప్‌ట్యాప్‌తోపాటు, మరో 15 పరికరాలు ఉన్నాయని, కిట్లను జిల్లాలోని సచివాలయ సిబ్బందికి అందజేశామని తెలిపారు. ఆధార్ సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ఈ కిట్లను అందజేసిందన్నారు. కార్యక్రమంలో సచివాలయాల పర్యవేక్షకుడు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీ చెన్నకేశవుడి రథోత్సవం

మాచర్ల రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్లలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి 145వ రథోత్సవం గురువారం వైభవంగా జరగనుంది. ప్రతియేటా చైత్రశుద్ధ త్రయోదశి నుంచి 15రోజులపాటు మాచర్లలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. అందులో స్వామివారి కల్యాణం అనంతరం రథోత్సవం ప్రధానఘట్టం. సుమారు లక్షమంది వరకు ఈ వేడుకను కనులారా వీక్షించేందుకు హాజరవుతారు.



చిత్రాల ప్రదర్శనను తిలకిస్తున్న రాష్ట్ర ఆర్ట్స్ క్రాఫ్ట్ శిల్పారామం చైర్ పర్సన్ మంజుల రెడ్డి

చిత్రకళా ప్రదర్శన ప్రారంభం

పెదకాకాని, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బి ఎఫ్ ఏ ప్రథమ, ద్వితీయ, తృతీయ విద్యార్థుల రూపొందించిన చిత్రాల ప్రదర్శనను బుధవారం ఆర్ట్స్ క్రాఫ్ట్ శిల్పారామం రాష్ట్ర చైర్పర్సన్ సిహెచ్ మంజులా రెడ్డి ప్రారంభించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క చిత్రము ఒకదానికొక్కటి పోటీపడే విధంగా చిత్రీకరించారని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాయగడ ఎక్స్‌ప్రెస్ కొద్ది రోజులపాటు విజయనగరం వరకే

గుంటూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్‌లో ఇంజనీరింగ్ పనుల కారనంగా నంబరు. 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 21, 28, మే 3వ తేదీన విజయనగరం వరకే ప్రయాణిస్తుందని గుంటూరు డివిజనల్ రైల్వే అధికారి సుధేష్ణ సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22, 29, మే 4వ తేదీన విజయనగరం నుంచి బయలుదేరి గుంటూరుకు ప్రయాణిస్తుందన్నారు. ఈ మార్పులను ప్రయాణీకులు గమనించాలని డీఆర్ఎం విజ్ఞప్తి చేశారు.

జీవో 35ని రద్దు చేయాలి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌లోని ఉద్యోగుల ప్రయోజనాలకు ఇబ్బంది కలిగించి, క్యాడర్‌లో తీవ్ర వ్యత్యాసాలకు కారణమైన జీఓ నెం.35ని వెంటనే రద్దు చేయాలని ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నేతలు కమిషనర్ ఎం కృష్ణతేజకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నేతలు బుధవారం పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం నేతలు మాట్లాడుతూ జీఓ 35 వల్ల ఏవోలకు ఎంపీడీఓల ప్రమోషన్‌లలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వం స్పందించి జీఓ రద్దుచేయని పక్షంలో ఉద్యమం చేపడతామని వెల్లడించారు.కార్యక్రమంలో ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం సలహాదారు బండి శ్రీనివాసరావు, అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్, జిల్లా నాయకులు డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు, గుంటుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రో గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు

● రూ.7.5 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ సతీశ్‌కుమార్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలతో అప్పుల పాలై సులభంగా డబ్బు సంపాదించాలని హైడ్రో గంజాయి విక్రయిస్తున్న ముగ్గుర్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ సతీశ్‌కుమార్ నిందితుల వివరాలను వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన ఇందుకూరి రామకృష్ణంరాజు, విశాఖపట్నం సీతమ్మధార ప్రాంతానికి చెందిన నాగరాజు శ్రీహర్షవర్ధన్ వర్మ స్నేహితులు. భీమవరంలో కోడిపందేలకు వెళ్లినప్పుడు వీరికి విశాఖ జిల్లా గోపాలపట్నానికి చెందిన పురుగంటి అనిల్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. అనిల్‌కుమార్ తన వద్ద ఉన్న గంజాయిని రామకృష్ణంరాజు, హర్షవర్ధన్‌లకు విక్రయించాడు. ఇలా రెండేళ్లపాటు వీరి మధ్య గంజాయి లావాదేవీలు నడిచాయి. ఈ క్రమంలో అనిల్‌కుమార్ బెంగళూరులో తన స్నేహితుడైన అమిత్ వద్ద హైడ్రో గంజాయి ఉందని, దానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని, గ్రాము రూ.700 చొప్పున కొని రూ.1500 చొప్పున విక్రయించవచ్చని తెలిపాడు. దీంతో అనిల్‌కుమార్, రామకృష్ణలు ఈ నెల 14న కారులో బెంగళూరు వెళ్లి అమిత్ అనే వ్యక్తి వద్ద సుమారు రూ.7.5 లక్షల విలువైన 500 గ్రాముల హైడ్రో గంజాయిని కొనుగోలు చేశారు. బెంగళూరు నుంచి ఏలూరుకు తిరిగివస్తుండగా మార్గమధ్యలో కాజ టోల్‌ప్లాజా వద్ద హర్షవర్ధన్ నుంచి వారు గంజాయి తీసుకుంటుండగా పోలీసులు దాడి చేశారు. ముగ్గురు నిందితులతోపాటు 500 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడ్ని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గిన్నిస్ బుక్‌లో కర్లపాలెం విద్యార్థి

● కీబోర్డు ప్లేలో జోయెల్‌విల్సన్ ప్రపంచ రికార్డు



గిన్నిస్‌బుక్‌లో నమోదు పత్రంతో జోయెల్ విల్సన్

కర్లపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుండివారిపాలెం పంచాయతీ బీడారు దిబ్బకు చెందిన విద్యార్థి కట్టుపల్లి జోయెల్‌విల్సన్ గిన్నీస్‌బుక్‌లో స్థానం దక్కించుకున్నారు. విల్సన్‌బాబు, ప్రత్యూష దంపతుల పెద్ద కుమారుడైన విల్సన్ కీబోర్డు ప్లేతో ప్రపంచరికార్డు సాధించారు. ఇటీవల 18 దేశాల నుంచి 1046 మంది ఒకేసారి మ్యూజిక్ ప్లే చేసి గిన్నీస్‌బుక్‌లో పేరు నమోదు చేసుకున్నారు. ఆగస్టీన్ దండంగి సారథ్యంలో విల్సన్ కీబోర్డులో మెలకువలు నేర్చుకుని పోటీలో పాల్గొన్నారు. గిన్నీస్‌బుక్‌లో స్థానం దక్కించుకున్న విల్సన్‌ను జిల్లాలోని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

1,57,640 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,59,032 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,57,640 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 76,896 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13500
334	9500	13100	షార్క్-1	10000	12300
నంబరు.5	10000	12800	బ్యాడిగి 355	10000	13000
273	10000	12500	సింజెంటా		
341	10500	13500	బ్యాడిగి 5531	--	--
4884	10000	11400	దేవనూరుడీలక్స్	10000	12500
సూపర్10	–	–	ఆర్మూరు	9800	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500

రేవులోకి వస్తే.. లేపేస్తాం

● కృష్ణా జిల్లా వాడివి ఎలా వస్తావ్..

● గింజుపల్లి రేవులో పడవ పాటదారుడికి బెదిరింపులు

● కలెక్టర్, ఎస్పీ, జడ్పీ అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): 'కృష్ణా జిల్లా వాడివి.. ఇక్కడకు వచ్చి చేసేది ఏమిటి.. పాట రద్దు చేసుకుని వెళ్లిపో.. రేవులోకి వస్తే లేపేస్తాం.. ఎక్కడికి వెళ్లినా ఏమీ చేయలేవు.. మేము లోకల్.. నువ్వు నాన్ లోకల్..' అంటూ అచ్చంపేట మండలం గింజుపల్లి పడవ పాటదారుడికి స్థానికులు బెదిరింపులు. ఈ మేరకు బాధితుడు ఇప్పటికే కలెక్టర్, ఎస్పీ, జెడ్పీ అధికారులకు ఫిర్యాదు చేశారు. రేవులోకి వస్తే లేపేస్తామని బెదిరిస్తుంటే సొమ్ము ఎలా చెల్లిస్తానని బాధితుడు జడ్పీ అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీంతో జడ్పీ అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. జడ్పీ ఆదాయానికి గండి కొట్టే విధంగా ప్రైవేటు వ్యక్తులు ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేస్తున్నారు. ఎటువంటి అనుమతి లేకుండానే గింజుపల్లి రేవులో పడవలు తిప్పుతున్న వారి వివరాలు సేకరించడంతో పాటు, పడవలను వెంటనే సీజ్ చేయాలని అచ్చంపేట ఎంపీడీవోను అధికారులు ఆదేశించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పడవ రేవుల కోసం ఇటీవల జడ్పీ పాటలు నిర్వహించగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదాయం సమకూరింది. గింజుపల్లి రేవుకు రూ.14 లక్షలు, రూ.13.90 లక్షలు, రూ.13 లక్షలతో ముగ్గురు ముందుకు రాగా స్థానికుల బెదిరింపులకు భయపడి ఇద్దరు రేవులోకి వెళ్లేందుకు సాహసించలేదు. ఈ నేపథ్యంలో మూడో వ్యక్తికి రేవును అప్పగించేందుకు అధికారులు సిద్ధపడినట్లు సమాచారం ఇచ్చారు. అయితే ఆ వ్యక్తి రేవులోకి అడుగుపెట్టడంతోనే బెదిరింపులు ఆరంభం అయ్యాయి. ఈ పరిస్థితులపై జడ్పీ అధికారులకు లేఖ రాసి, కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

మొదటి నుంచి వివాదమే...

గింజుపల్లి రేవు వ్యవహారంలో మొదటి నుంచి వివాదం నెలకొంది. నామమాత్రపు రుసుముతో రేవును దక్కించుకునేందుకు కొందరు సిఫార్సులు కూడా చేయించినట్లు తెలుస్తుంది. అయితే అది బహిరంగ వేలం కావడంతో అధికారులు చేతులు ఎత్తేశారు. ప్రస్తుతం పాత వ్యక్తులే రేవులో అనధికారికంగా పడవ తిప్పుతూ అధికారికంగా పాట పాడుకున్న వారిని రేవులోకి రాకుండా అడ్డుకుంటున్నట్లు తేలింది.

జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చేస్తే జర్మనీలో ఉద్యోగాలు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివి 20 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ టీవీ విజయలక్ష్మి తెలిపారు. నైపుణ్యం కోసం ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు గుంటూరు సమీపంలోని ఓబులునాయుడుపాలెం శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

525 ఎకరాల్లో ఉద్యాన పంటల పెంపకం



మాట్లాడుతున్న పీడీ శంకర్, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి 525 ఎకరాల్లో ఉపాధిహామీ పథకం కింద ఉద్యానపంటల పెంపకానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్ వెల్లడించారు. లబ్ధిదారుల గుర్తింపు, పరిపాలనామోదం మంజూరు ప్రక్రియను ఈ నెల 30వ తేదీలోపు పూర్తిచేయాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఈ మేరకు గుంటూరు మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ 500 ఎకరాల ఉద్యానపంటలు, 25 ఎకరాల మునగపంటను ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని, వ్యవసాయ అనుబంధ శాఖల మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని లక్ష్యానికి మించి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. లబ్ధిదారులు సన్న, చిన్నకారు రైతులై వుండి ఉపాధి పథకం జాబ్‌కార్డ్ ఉంటే ఒక్కొక్క కుటుంబానికి 1/2నుంచి 5 ఎకరాల వరకు లబ్ధిపొందటానికి అర్హత వుంటుందన్నారు. సాధారణ ఉద్యానపంటలైతే పంట మూడేళ్ల వయసు వరకు వీరికి 100శాతం సబ్సిడీ ఉపాధి పథకం నుండి అందిస్తామన్నారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి బి.రవీంద్రబాబు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో ఉద్యానపంటల సాగుకు అవకాశాలు పుష్కలంగా వున్నాయన్నారు. ఇందుకోసం రైతులను సంప్రదాయ వ్యవసాయ పంటల నుంచి ఉద్యాన పంటలకు మళ్లేలా చూడాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యానపంటల సాగుకు రైతులను గుర్తించే క్రమంలోనే ఫారంపాండ్ కూడా మంజూరుచేస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మైక్రో ఇరిగేషన్ పీడీ వజ్రశ్రీ మాట్లాడుతూ ఈ ఉద్యానపంటల లబ్ధిదారులకు ఉపాధి పథకం ముగిసిన వెంటనే సూక్ష్మ నీటి పారుదల పథకాన్ని వర్తింపజేస్తామన్నారు.

బాపట్ల వార్తలు



భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేసి సూచనలు చేస్తున్న ఎస్పీ తుషార్ డూడి

తీరంలో నిర్దిష్ట లోతును సూచించే జెండాలు ఏర్పాటు

- ఎస్పీ తుషార్ డూడి
- నిఘా కోసం డ్రోన్ కెమెరాలు ఏర్పాటు

బాపట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాలు నివారించటంలో భాగంగా సూర్యలంక సముద్రతీరంలో నిర్దిష్టలోతును సూచించే విధంగా జెండాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. తీరం వద్ద భద్రత ఏర్పాట్లను బుధవారం ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి సముద్రంలో మునగరాదన్నారు. మహిళల పట్ల ఆసభ్యకరంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. తీరంలో నిఘా కోసం డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నామన్నారు. తీరంలో డ్రోన్ ఎగురవేసి సూర్యలంక సముద్రతీర పరిసరాలను పరిశీలించారు. విధులు నిర్వహించే పోలీసుసిబ్బందికి, గజ ఈతగాళ్ళకు విధినిర్వాహణలో పాటించవల్సిన మెళుకువలు తెలిపారు. యాత్రీకులు బీచ్ పరిసరాలలో వ్యవహరించవల్సిన తీరును వివరిస్తూ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావున ఎక్కువ సంఖ్యలో యాత్రీకులు సూర్యలంక వస్తుంటారన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని సముద్రలోతులకు వెళుతున్న యాత్రికులను అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రామాంజనేయులు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నీటి తీరువా చెల్లింపుపై అవగాహన కల్పించాలి

బాపట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నీటి తీరువా చెల్లింపులతో కలిగే బహుళ ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. రెవెన్యూ అంశాలపై ఆర్డీవో, తహసీల్దార్‌లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. రైతులను చైతన్యపరిచి నీటి తీరువా వసూళ్ళు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 3.30 లక్షల మంది రైతులు నీటితీరువా పరిధిలోకి వస్తున్నారని చెప్పారు. వీరి నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం, గత బకాయి కలిపి రూ.15.46 కోట్లు వసూళ్ళు చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రూ.2.26 కోట్లు మాత్రమే వసూళ్ళు చేయటం ఏమిటని అధికారులను ప్రశ్నించారు? ఆర్డీవోలు, తహసీల్దార్‌ల పర్యవేక్షణ లోపంతోనే పన్ను వసూళ్ళు జరగటం లేదన్నారు. రైతుల సంక్షేమం కోసమే ఆ నగదును వినియోగిస్తుందనే విషయాన్ని రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. 180 గ్రామాల రైతుల వివరాలను వీఆర్వో లాగిన్ నుంచి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయకపోవటంపై అధికారులను ప్రశ్నించారు? డిప్యూటీ తహసీల్దార్‌ల లాగిన్‌ల నుంచి మరో 68 గ్రామాల రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. బాపట్ల, వేమూరు, అమర్తలూరు, భట్టిప్రోలు, నగరం, రేపల్లె, చీరాల, పర్చూరు, కారంచేడు, చినగంజాం మండలాలలో వసూళ్ళు చాలా తక్కువగా ఉందన్నారు. నివాస భూమిలేని పేదలందరికి ఇంటిస్థలం పంపిణీకి ప్రభుత్వం అనుమతులిచ్చిందని కలెక్టర్ చెప్పారు. పేదలందరికి ఇల్లు కార్యక్రమం కింద గుర్తించిన దరఖాస్తులను పునఃపరిశీలన చేయాలన్నారు. ప్రభుత్వ భూమిలో దశాబ్దాలుగా ఉంటున్న వారిని గుర్తించి విచారించాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

రూ.3.67కోట్లతో సీసీరోడ్లు : కలెక్టర్

గ్రామప్రజల సమస్యల పరిష్కారంలో భాగంగా సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చినగంజాం మండలం చిన్నకొత్త గొల్లపాలెం గ్రామానికి విచ్చేసిన సందర్భంగా అధికారులు ఆ గ్రామంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. గ్రామంలో 3.67 కోట్ల రూపాయలు వెచ్చించి రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. తక్షణమే సీసీ రోడ్లు నిర్మించాలని పంచాయతీరాజ్ ఈఈని ఆదేశించారు. అదేవిధంగా 17 గృహాలకు మరుగుదొడ్లు మంజూరు చేశామని త్వరగా నిర్మించాలన్నారు. 28 గ్యాస్ కనెక్షన్‌లు కావాలని వచ్చిన అభ్యర్థనలను పరిగణంలోకి తీసుకొని తక్షణమే మంజూరు చేయాలన్నారు. 304 గృహాలకు జలజీవన్ మిషన్ కింద కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాలని ఆదేశించారు. సూర్యఘర్ పథకం కింద సౌర విద్యుత్ కల్పించాలన్నారు. 91మంది నుంచి గృహాలు కావాలని దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించాలన్నారు. 304 గృహాలకు ఎస్‌ఎఫ్‌ఎల్ ద్వారా అంతర్జాలం సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో సంబంధితశాఖ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'రన్‌ఫర్ జీసెస్' జయప్రదం చేయాలి

బాపట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏడాది వలే ఈ ఏడాది 19వ తేది శనివారం రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎఫ్‌డబ్ల్యు కోల్ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సంఘ ప్రతినిధులతో కలిసి బుధవారం విజయలక్ష్మీపురంలో ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ, మండల పరిధిలోని సంఘకాపరులు పెద్దలు, విశ్వాసులు, యువత ఈ కార్యక్రమానికి తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఉదయం 6 గంటలకు సూర్యలంకరోడ్డులోని ఇండియన్ గ్యాస్ గోదాం వద్ద నుంచి ప్రారంభమై విజయలక్ష్మీపురం, కొత్తపేట, దగ్గుమల్లివారిపాలెం, విలియంబూత్ జూనియర్ కళాశాల, అంబేడ్కర్ సర్కిల్, పాతబస్టాండ్, కొతబస్టాండ్, విద్యానగర్ వరకు కార్యక్రమాన్ని నిర్వహించి తిరిగి సీబీజెడ్‌లోకి వచ్చి కార్యక్రమాన్ని ముగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గేరా మణిభూషణ్, దాసరి శ్యామ్‌లివింగ్‌స్టన్, గడ్డం ఏలియా, జి.జాన్‌వెస్లీ, కాగిత సుందరదాసు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘకాపరులు, పెద్దలు

సమాచార హక్కు చట్టానికి తూట్లు

- డాక్టర్ పీసీ.సాయిబాబు

బాపట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టానికి తూట్లు పడుతున్నాయని ఫోరంఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. ఈవిషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన డిజిటల్ డేటా పరిరక్షణ చట్టంలో ఆందోళన కలిగించే పలు అంశాలు ఉన్నాయన్నారు. ఇది సమాచార హక్కు చట్టానికి కొన్ని సవరణలు ప్రతిపాదిస్తుందని, దీనివల్ల చట్టం బలహీనపడుతుందన్నారు. విస్తృత ప్రజాప్రయోజనం కలిగిన వ్యక్తిగత సమాచారం ప్రజలకు అందుబాటులోకి రాకుండా పోతుందన్నారు. ఈ నూతన చట్టం జర్నలిస్ట్‌ల స్వేచ్ఛను కూడా హరిస్తుందన్నారు. సమ్మతి పొందకుండా వ్యక్తులపై వార్తలు రాస్తే రూ.250 కోట్ల వరకు జరిమాన విధించే అవకాశం ఈ చట్టం కల్పిస్తుందన్నారు. ఈ అంశంపై యదార్థాలను బయటపెట్టటాన్ని నిరుత్సాహపరుస్తుందని ఆయన పేర్కొన్నారు.

శ్రీబగళాముఖి దేవస్థాన హుండీ లెక్కింపు

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో బుధవారం గుంటూరు డిప్యూటీ కమిషనర్, దేవదాయశాఖ ఆదేశాల మేరకు బాపట్ల డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి పర్యవేక్షణలో భక్తులు సమర్పించిన కానుకల హుండీలను లెక్కించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. చందోలు, భట్టిప్రోలు, చెరుకుపల్లి, గుళ్ళపల్లి, రేపల్లె ప్రాంతాలు నుంచి విచ్చేసిన భక్తుల సహకారంతో కానుకలను లెక్కించినట్లు ఆయన తెలిపారు. 98 రోజులకుగాను రూ.4 లక్షల 9 వేల 420 ఆదాయం వచ్చినట్లు జి.నరసింహమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దేవదాయ శాఖ పొన్నూరు హెచ్‌డీఎఫ్ బ్యాంక్ సిబ్బంది, చందోలు పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు.

గోరంట్ల అరెస్ట్ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతీక : కొల్లా

బాపట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ అరెస్ట్ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతీక అని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఈ విషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ గోరంట్ల అరెస్ట్ బలహీనవర్గాలపై దాడియేనని మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ అవాకులు, చెవాకులు పేలటం వైసీపీ నీచరాజకీయాలకు నిదర్శనమన్నారు.

మాతాశిశు మరణాలు లేకుండా చూడాలి

- కలెక్టర్ జె.వెంకటమురళి
- నిర్లక్ష్య వైద్యులపై చర్యలకు ఆదేశాలు



మాతాశిశు మరణాలపై కమిటీ సభ్యులతో సమీక్షిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మాతాశిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి వైద్యులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం గత ఏడాది ఆగస్టులో సంభవించిన రెండు ప్రసవ మరణాలపై కలెక్టర్ మాతాశిశు మరణాల కమిటి సభ్యులతో సమీక్షించారు. తొలుత నిడమనూరు గ్రామానికి చెందిన మానికల లక్ష్మీ చీరాల ఏరియా వైద్యశాలలో ప్రసవించి అత్యవసర పరిస్థితులలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించటం జరిగిందని వైద్యులు వివరించారు. 2024న ఆగస్టు 31న గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినందున కేసుకు సంబంధించి కలెక్టర్ సంబంధిత వైద్యం అందించిన డాక్టర్లను ఆరా తీశారు. లక్ష్మికి సంబంధించిన మాతా శిశు సంరక్షణ కార్డులో ఆమెది 9వ ప్రసవమని, ఆ కేసు ఎక్కువ రిస్క్‌తో కూడుకున్నదని నమోదు చేయటాన్ని సంబంధిత వివరాలను డాక్టర్‌లను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. లక్ష్మికి వైద్యం అందించటంలో తీసుకున్న చర్యలపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. వైద్యం అందించిన డాక్టర్, ఇతర సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని అందుకు సంబంధించిన నివేదికను తయారు చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మను కలెక్టర్ ఆదేశించారు.

కారుమూరి ఆషా అనే మహిళ మరణంపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆశా రేపల్లె కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లో 2024 ఆగస్టు 11న ఆసుపత్రిలో చేరి డెలివరి అయి డిశ్చార్జి అయ్యిందని తదుపరి ఆగస్టు 19న డయారియాతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరి 20వ తేదిన మరణించిందని కమ్యూనిటి హెల్త్ సెంటర్ వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. మహిళలు ప్రెగ్నెన్సీ వచ్చిన తర్వాత డెలివరి అయ్యేవరకు డాక్టర్లు వారిని పర్యవేక్షిస్తూ సకాలంలో వైద్యం అందిస్తూ మాతాశిశు మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎమ్ అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డాక్టర్ రామకృష్ణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సమన్యాయంతోనే సమాజాభివృద్ధి సాధ్యం

- బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదించడంపై టీడీపీ బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వంతోనే దళితుల అభివృద్ధి సాధ్యమని అన్నారు. రాజీవ్ రంజన్ మిశ్రా నివేదికను పరిశీలించి, మంత్రుల కమిటీ సమర్పించిన నివేదిక పై కేబినెట్ చర్చించి, 200 పాయింట్ల రోస్టర్ అమలుకు నిర్ణయించిందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో విడుదలవనున్న డీఎస్సీ నోటిఫికేషన్‌తో వర్గీకరణ అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రోస్టర్‌లో తీసుకున్న 200 పాయింట్ల విధానం ప్రకారం మొదటి 100 పోస్టుల్లో రెల్లి ఉపకులాలకు (గ్రూప్-1) 1, మాదిగ ఉపకులాలకు (గ్రూప్-2) 6, మాల ఉపకులాలకు (గ్రూప్-3) 8 చొప్పున పోస్టులు వస్తాయి. రెండో 100 పోస్టుల్లో రెల్లి ఉపకులాలకు (గ్రూప్-1) 1, మాదిగ ఉపకులాలకు (గ్రూప్-2) 7, మాల ఉపకులాలకు (గ్రూప్-3) 7 చొప్పున పోస్టులు వస్తాయని, దీని వల్ల వెనుకబడిన ఎస్సీ కులాలకు ఇన్నేళ్ళుగా అందని న్యాయం కూటమి ప్రభుత్వ చొరవతో అందుతుందని స్పష్టీకరించారు. 2026 జనగణన తరువాత వర్గీకరణను జిల్లాల వారీగా అమలు చేస్తామన్నారు.

వేట విరామ భృతికి ధ్రువపత్రాలు సమర్పించాలి

- జిల్లా మత్స్యశాఖాధికారి కె.శ్రీనివాస్ నాయక్

బాపట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చేపల వేట విరామ భృతికి సంబంధించి మత్స్యశాఖ సిబ్బంది సంబంధిత ఫిష్ ల్యాండింగ్ సెంటర్ వద్ద ఎన్యూమరేషన్ ప్రక్రియ చేస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖాధికారి కె.శ్రీనివాస్ నాయక్ బుధవారం తెలిపారు. బోటు యజమానులు వారి దగ్గర పని చేసే వారి ధ్రువపత్రాలను సమర్పించాలన్నారు. బోటు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, బోటు లైసెన్స్ సర్టిఫికెట్, బోటు యజమాని, సిబ్బంది, ఆధార్ కార్డు జిరాక్స్‌లు, బ్యాంక్ పాస్‌పుస్తకం జిరాక్స్ సమర్పించాలన్నారు. తద్వారా వారి ఖాతాలలో విరామ భృతి డబ్బులు జమచేయటం జరుగుతుందని చెప్పారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

బాపట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయలక్ష్మీపురం భావన టవర్స్‌లో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక కేంద్రాధికారి వై.వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి ఎల్‌పీజీ గ్యాస్, విద్యుత్ వలన జరిగే అగ్నిప్రమాదాలు గురించి వివరించారు. ఎల్‌పీజీ గ్యాస్ డెమో చూపించి అగ్నిమాపక పరికరాలు ఉపయోగించి ప్రమాదాలు నివారించటం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పండ్లు, కూరగాయల సాగుపై శిక్షణ

బాపట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిసరాలలో తోటల సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి అర్బన్ కేంద్రాలలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పూల పెంపకం చేసే విధానం ద్వారా ఆహారభద్రత కలుగుతుందని వివరించారు. వ్యవసాయ కళాశాలలో ఐసిఏఆర్ ఎస్‌సి సబ్‌ప్లాన్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యానవిభాగాధిపతి డాక్టర్ వి.శ్రీలత, డాక్టర్ ఎన్.రత్నకుమారి, డాక్టర్ కె.సుశీల, డాక్టర్ ఎం.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు వైద్యుల నియామకం

బాపట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఏరియా వైద్యశాలకు మరో ఇద్దరు వైద్యులను నియమించారు. జనరల్ సర్జన్‌గా డాక్టర్ ఆర్.శివప్రసాద్‌నాయక్, రేడియాలజిగా డాక్టర్ పి.దినేష్‌బాబులను నియమించగా బుధవారం బాధ్యతలు చేపట్టినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ తెలిపారు.

గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి

బాపట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నిరోధానికి, వితంతువుల పునర్వివాహానికి నిరంతరం పోరాటం చేసిన త్యాగధనులు కందుకూరి వీరేశలింగం పంతులు అని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి సభలో బుధవారం సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, డాక్టర్ శ్రీనివాస్‌లు సంయుక్తంగా మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగంపంతులు సమాజంలో సామాజిక రుగ్మతలు దూరం చేయటానికి 130 పైచిలుకు రచనలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో దగ్గుమల్లి శామ్యూల్, మర్రి మాల్యాద్రిరావు, కామరాజు కాళీదాసు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి తదితరులు కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు..

ఘన వ్యర్థాలపై శిక్షణ

కర్లపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని పంచాయతీలలో వ్యర్థ పదార్థాల ద్వారా సంపదను సృష్టించాలని, పంచాయతీలను అభివృద్ధి బాటలో నడిపించాలని జిల్లా పంచాయతీ అధికారి కె.ఎల్.ప్రభాకరరావు అన్నారు. మండలంలోని దమ్మనవారిపాలెం పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివాస్ కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల నివారణపై 8 పంచాయతీలలోని క్లాప్‌మిత్ర కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ పంచాయతీ అవార్డు గ్రహీత, సర్పంచ్ గర్రపుసాల వెంకటేశ్వరమ్మ, ఈవోపీఆర్డీ ఐనంపూడి శ్రీనివాసరావు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



మాధవి (ఫైల్)

బాపట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల రైల్వేస్టేషన్ దగ్గర పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన మహిళ గోరంట్ల మాధవి గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. మృతదేహాన్ని గురువారం తీసుకురానున్నట్లు చెప్పారు. కాగా ఆమెతోపాటు రిటైర్డ్ రైల్వే ఉద్యోగి తులాబందుల లక్ష్మీనారాయణ కూడా ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయన కూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.



సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

కష్టించేతత్వానికి గిరిజనులు ప్రతిరూపాలు

- జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి బి.ప్రకాశరావు

కొల్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కష్టించేతత్వానికి గిరిపుత్రులు ప్రతి రూపాలని జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి బి.ప్రకాశరావు అన్నారు. కొల్లూరులో ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ ఎరుకుల ఆత్మీయ సంఘ సమావేశం ఇట్టా ధనకోటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అధికారితో పాటు కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, గిరిజనులు స్వాభిమానం కలవారని, అందరూ ఐక్యతతో తమ హక్కులు సాధించుకోవాలన్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గిరిజనులకు తన వంతు పూర్తి సహకారం అందిస్తారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులను ఆయన సత్కరించారు. సంఘ నాయకులు, ముఖ్య అతిథులను పూల బొకేలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గరికా నాంచారయ్య, కట్టా శ్రీనివాసరావు, వెంకటస్వామి, గరిక అనంతభోగేశ్వరస్వామి పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధి పనులు పరిశీలించిన మైనేని

తాడిగిరిపాడు, బొద్దులూరుపాడు లింకు రోడ్డు, కాల్వ కట్టల అభివృద్ధి పనులను బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, డొంక రోడ్లను తారు రోడ్డుగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే చొరవతో నిధులు మంజూరయ్యాయని వేసవి పూర్తయ్యే నాటికి ఆయా రహదారుల నిర్మాణం పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఆయనవెంట టీడీపీ నాయకుడు వేములపల్లి మోహనకృష్ణ ఉన్నారు.

పీఎంశ్రీ ఒకేషనల్ కోర్సుల ఇంటర్నల్‌షిప్ తరగతులు

వేమూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పీఎంశ్రీ ఒకేషనల్ కోర్సుల ఇంటర్నల్‌షిప్ తరగతులను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయని భాగ్యమ్మ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఒకేషనల్ కోర్సులు భవిష్యత్తులో విద్యార్థులకు బహుళ ప్రయోజనకరంగా దోహదపడతాయన్నారు. విద్యార్థులకు ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం, మరమ్మతులు, ద్విచక్ర వాహనాల పని తీరు మరమ్మతులపై ప్రత్యేక శిక్షణ అందించారు. ఉపాధ్యాయులు ట్రైనర్ పుష్పలత, సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

చెరుకుపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి మండలం పొన్నపల్లిలోని మేరీరోజ్‌బర్డ్స్ స్కూలు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. గుళ్ళపల్లికి చెందిన బట్టు నాగేశ్వరరావు(36)మరొక వ్యక్తితో గుళ్ళపల్లి నుంచి పొన్నపల్లి బైక్‌పై వెళ్తుండగా పొన్నపల్లిలోని మేరీరోజ్ బర్డ్స్‌స్కూలు వద్ద టాటాఏసీ రివర్స్ చేస్తుండగా బైక్ అదుపుతప్పి టాటాఏసీని వెనుక నుంచి ఢీకొనడంతో ఆ వ్యక్తి రోడ్డుపై పడిపోయాడని స్థానికులు చెప్పారు. అతనిని వెంటనే స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే అతను మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. బైకుపై ఉన్న రెండో వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ఏరియా వైద్యశాలకు తరలించారు.

300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

రేపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలోని జంపానివారిపాలెంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. సారా బట్టీలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ నిజాంపట్నం మండలం దిండి పంచాయతీలోని జంపానివారిపాలెం, అదవల గ్రామాల్లో సారాబట్టీలు నిర్వహిస్తున్నారని సమాచారం రావటంతో దాడులు చేసి 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కె.శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణ, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభించిన ఎంపీపీ

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులను ఎంపీపీ డీవీ లలితకుమారి బుధవారం ప్రారంభించారు. మండల పరిధిలోని పెదపులివర్రు పంచాయతీ శివారు గ్రామంలోని పెదపాలెంలో ఉపాధి హామీ పనులను ఎంపీపీ ప్రారంభించి కూలీలతో ముచ్చటించారు. ఎండ తీవ్రత దృష్ట్యా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాట్లాడుతూ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పని ప్రదేశాల్లో అందుబాటులో ఉండేలా చూస్తామని కూలీలకు హామీ ఇచ్చారు. మూడు నెలల నుంచి కూలీలకు ఉపాధి హామీ నగదు అందక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం సత్వరమే వారి దినసరి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నాగశ్రీ, నాగమల్లేశ్వరరావు, కూలీలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పెంపునకు కృషి

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయ సాగుకు కృషి చేస్తామని వెల్లటూరు క్లస్టర్ ఇన్‌చార్జి మోటూరి పుణ్య శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రకృతి విభాగం అధికారి నీలం ప్రకాష్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు పీఎండీఎస్ కిట్లు పంపిణీ చేశారు. 20 రకాల విత్తనాలతో 150 కిట్లు తయారు చేసి రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి, సాగునీటి సంఘం అధ్యక్షులు కె.నాగమల్లేశ్వరరావు, కృష్ణబాబు, ఐసీఏఆర్‌లు, రైతులు పాల్గొన్నారు.



పబ్లిక్ గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సమస్యల సత్వర పరిష్కారం కోసమే పబ్లిక్ గ్రీవెన్స్

అమృతలూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు పబ్లిక్ గ్రీవెన్స్ ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. అమృతలూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పబ్లిక్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజల నుండి ఎమ్మెల్యే అర్జీలు స్వీకరించారు. స్వీకరించిన అర్జీల సమస్యలను సంబంధిత శాఖల అధికారుల వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల వద్దకు వచ్చి సమస్యలు స్వీకరించి వారి సమస్యలను త్వరితగతిగా పరిష్కరించనున్నట్లు చెప్పారు. ప్రతి నిత్యం ప్రజల వద్ద నుంచి వారి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తానన్నారు. అదనంగా ఈ వేదిక ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొట్టిపాటి పూర్ణకుమారి గంగాధర్, తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు, ఎంపీడీవో శేషమాంబ, ఈవోపీఆర్డీ రవిశంకర్, ఎస్ఐ జానకి అమర్‌వర్ధన్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పనిముట్లు అందజేసిన ఎమ్మెల్యే

వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లును రైతులకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బుధవారం అందజేశారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా 49 మంది రైతులకు 24 లక్షల 49 వేల 380 రూపాయలు విలువ చేసే పరికరాలకు సంబంధించి 9 లక్షల 74 వేల 550 రూపాయలను వ్యవసాయ శాఖ రాయితీ అందజేసింది. వీటిని ఆయా రైతులకు ఎమ్మెల్యే చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీలక్ష్మీ, గొట్టిపాటి పూర్ణకుమారి, క్రొత్తపల్లి రవీంద్రబాబు, ఏఈవో శ్రీకాంత్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం కెమిస్ట్రీ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎం కెమిస్ట్రీ ల్యాబ్‌ను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బుధవారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ నిధుల నుండి ప్రధాన మంత్రి స్కూల్ రైజింగ్ ఇండియా పథకంలో భాగంగా 15.58 లక్షల నిధులు ఉన్నత పాఠశాలకు విడుదలయ్యాయి. రూ.12 లక్షలతో ఈ భవనం పూర్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే చేతుల మీదగా నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నిరీక్షణరావు, పాఠశాల చైర్మన్ వినయ్‌బాబు, గొట్టిపాటి పూర్ణకుమారి గంగాధర్, ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్, సర్పంచ్ దేవరకొండరాము, యలవర్తి బ్రహ్మానందం, క్రొత్తపల్లి రవీంద్రబాబు, శరణుగిరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మినీ వాటర్‌స్కీమ్ శంకుస్థాపనలో పాల్గొన్న అనగాని శివప్రసాద్ తదితరులు

సమృద్ధిగా తాగునీరు అందించటమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్
- రూ.5 లక్షలతో మినీ వాటర్‌స్కీమ్ ఏర్పాటు

రేపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. రేపల్లె మండలం నెల్లూరువారిపాలెంలో రూ.5లక్షల నిధులతో మినీ వాటర్‌స్కీమ్‌కు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో తాగునీటికోసం ప్రజలకు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. అన్ని గ్రామాల్లో మినీ వాటర్ స్కీమ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించటం జరిగిందని, ముందుగా మంజూరైన వాటికి పనులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలందరకు తాగునీరు అందించటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. త్వరితగతిన ఈ పనులు పూర్తి చేసి ప్రజలకు నీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు, తొట్టెంపూడి సుభాష్, కె.సత్యం, కేసన నరసింహ, తోట మునేష్, దేవగిరి రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం

చెరుకుపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాలలో మండలంలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు చెరుకుపల్లిలోని తెనాలి రోడ్డులో ఉన్న మల్లాది రంగారావు కాంప్లెక్స్‌లో టీడీపీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ నగదుపురస్కారం అందించారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందిస్తూ మరింత ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆశీర్వదించారు. పురస్కారం పొందిన విద్యార్థులలో ఎం.సాయిమహిత, సీహెచ్ శృతి, ఎం.తనూజ, సీహెచ్ అక్షయశ్రీ, ఎస్.నాగహర్షిణి, షేక్ యాస్మిన్ రిజ్వి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.రాధాకృష్ణమూర్తి, దివి రాంబాబు, మల్లాది రామకృష్ణ, చెరుకుపల్లి జడ్పీటీసీ మర్రివాడ పావని, కొనకాల రవికిరణ్, తలశిల విజయనాగ్, వంగరు శ్రీనివాస్, చక్రవర్తి, డాక్టర్ కాటూరి శ్రీనివాస్, డాక్టర్ కమ్మెల హరీష్, తాతా ఏడుకొండలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాఫిర్యాదుల కార్యక్రమం

రేపల్లె, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి జీవీ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల కార్యక్రమానికి 55 ఫిర్యాదులు అందాయి. ఆయన మాట్లాడుతూ వచ్చిన అర్జీల్లో 30 భూమికి సంబంధించిన సమస్యలు వచ్చాయన్నారు. పట్టణం, గ్రామాల్లో కొన్ని ప్రాంతాల్లో రహదారులు, తాగునీటి సమస్యలపై ఫిర్యాదులు అందాయని, ఆయా శాఖల అధికారులకు వచ్చిన ఫిర్యాదులు అందించి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొర్రా సూర్యరాజు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, మద్దుల అంకాలు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఫిర్యాదులు అందిస్తున్న మహిళలు

గర్భవతులు వైద్యుల సూచనలు పాటించాలి

వేమూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గర్భవతి అయిన నాటి నుంచి వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సూచనల మేరకు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి తెలియజేశారు. మండలంలోని చావలి గ్రామంలో 6వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, గర్భవతులు వైద్య పరీక్షలు చేయించుకుంటూ టీటీ ఇంజక్షన్, హెచ్‌బి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి చేనేత కార్మికుడి మృతి



వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ప్రమాదానికి గురై చేనేత కార్మికుడు దుర్మరణం చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని అనుమల్లిపేట గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొడ్డు మోహన్‌రావు(64) భార్య మాధవి చేనేత కార్మికులు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రోజులాగే ఉదయం సమీపంలోని చిల్లర కొట్టు వద్దకు పాల ప్యాకెట్ తెచ్చేందుకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో రోడ్డుకు అడ్డంగా ఓ ఇంటికి చెందిన విద్యుత్ సర్వీస్ వైరు మంగళవారం రాత్రి ఈదురు గాలులకు తెగిపడి ఉంది. అవగాహన లేని మోహన్‌రావు ఆ వైరును అక్కడి నుంచి పక్కకు పెట్టేందుకు చేతితో పట్టుకోవడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహానికి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు పెద్ద దిక్కును కోల్పోయి విలపించారు.

బిహార్ యువకుడి మృతి

అద్దంకి : మణికేశ్వరంలో విద్యుత్ షాక్‌తో బిహార్ రాష్ట్రానికి చెందిన యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బిహార్ రాష్ట్రం పాట్నా జిల్లా హల్దిచప్రకు చెందిన బికాస్ యాదవ్(22) మణికేశ్వరంలోని వైసీపీ నాయకుడు శ్రీనివాస రెడ్డికి చెందిన డెయిరీ ఫాంలో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం బికాస్ మేత కటింగ్ మిషన్ వద్ద పనిచేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. సీఐ సుబ్బరాజు, ఎస్సై ఖాదర్ బాషా పరిశీలించి కేసు నమోదు చేశారు.

29న పోలేరమ్మ తిరునాళ్ల

నూతలపాడు (పర్చూరు), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలం నూతలపాడులోని పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల ఈనెల 29న జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా శిడిమానోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

నేలవాలిన మొక్కజొన్న

- పలుచోట్ల బొప్పాయి, అరటికి నష్టం
- లబోదిబోమంటున్న రైతులు

పంగులూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం తెల్లవారుజామున వీచిన పెను గాలులకు కండె గింజ పోసుకునే దశలో ఉన్న మొక్కజొన్న పైరు నేలవాలగా, వర్షం ధాటికి కల్లాలలో ఆరబెట్టిన మొక్కజొన్న తడిచాయి. మూడున్నర గంటల సమయంలో ఒక్కసారిగా వీచిన పెను గాలులతో కూడిన వర్షంతో పంటలకు నష్టం వాటిల్లింది. తూర్పు తక్కెళ్లపాడు గ్రామంలో బలంగా వీచిన పెనుగాలికి కండె గింజ పోసుకునే దశకు



కల్లాల్లో ఆరబెట్టి ఉన్న మిర్చి

చేరుకున్న మొక్కజొన్న పైరు పదిఎకరాలకు పైగా పూర్తిగా నేలపాలై పనికి రాకుండా పోయింది. కోటపాడు, కొండమంజులూరు గ్రామాలలో మంగళవారం సాయంత్రం నూర్పిడి చేసి ఉంచిన మొక్కజొన్న రాశులు వర్షం ధాటికి నెమ్మెక్కాయి. పందిళ్లకు ఉంచిన పొగాకు తాళ్లను రైతులు వర్షానికి తడవకుండా కాపాడుకోవాలని పరిస్థితి. ఈ నెల 13న వీచిన గాలులకు కొండమూరు, రేణంగావరంలో నూర్పిడి చేరుకున్న మొక్కజొన్న నేలవాలి నష్టం వాటిల్లింది. వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులు కలవర పెడుతున్నాయి.

బల్లికురవ : గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు, గాలుల ప్రభావంతో మొక్కజొన్నపై దెబ్బ పడింది. మంగళవారం రాత్రి కొన్ని గ్రామాలలో కురిసిన భారీ వర్షం కురిసింది. బల్లికురవ మండలంలోని గంగపాలెం, కొణిదెన గ్రామాల్లో అకాల వర్షంతో మొక్కజొన్న కల్లాలపై గుండా వర్షపు నీరు పారింది. అలానే మొక్కజొన్న విత్తనాలు పూర్తిగా తడిచి పోయాయి. బుధవారం రైతులు తడిచిన మొక్కజొన్నను చూసి లబోదిబో



తూర్పుతక్కెళ్లపాడులో గాలులకు నేలకొరిగిన మొక్కజొన్న పైరు

మంటున్నారు. దెబ్బ తిన్న పంటలకు పంట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

పర్చూరు : ఆరుగాలం శ్రమించి పంటలు అకాల వర్షాలకు ఆవిరవుతున్నాయని రైతులు బోరుమంటున్నారు. మిర్చి, పొగాకు, మొక్కజొన్న రైతులు కల్లాల్లో, పందిళ్లకు ఉన్న పంటలను వానల నుంచి కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. కల్లాల్లో ఉన్న మిర్చిని ఇంటికి తెచ్చి భద్రపరుచుకుందామన్నా పూర్తి స్థాయిలో అరకపోవడం వల్ల బూజుపట్టే ప్రమాదం ఉంది. పందిళ్ళకు ఉన్న పొగాకు, పొలాల్లో ఉన్న మొక్కజొన్న, కోతకు సిద్ధంగా ఉన్న మిర్చి వర్షానికి బెబ్బతింటోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక, మరోపక్క వానలకు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంకొల్లు : బుధవారం కురిసిన అకాల వర్షంతో రైతులు ఆందోళన చెందారు. కల్లాల్లో మిర్చి, పొగాకు తడవకుండా కాపాడుకునేందుకు పరుగులు తీసారు. కొద్దిసేపటికి వాన ఆగిపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

అర్ధరాత్రి వాన

జలమయమైన రహదారులు

చీరాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలో బుధవారం అర్ధరాత్రి జోరుగా వాన కురిసింది. సుమారు రెండు గంటల పాటు విడతల వారీగా కురిసిన వర్షం కారణంగా పలు ప్రాంతాలు, రహదారులు సైతం వర్షపు నీటితో నిండాయి, ఈక్రమంలోనే చీరాల - బాపట్ల మధ్య రహదారిలో పలు చోట్ల జలమయంగా మారాయి. ముఖ్యంగా ఈపూరుపాలెం రోడ్లపైకి నీళ్ల నిలవడంతో వాహన దారులు, ప్రజలు అసౌకర్యం చెందారు. ఈపూరుపాలెం ప్రధాన రహదారిలో కొన్నిచోట్ల చిన్నపాటి వానకి సైతం నీళ్ల నిలుస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

మార్టూరు : బుధవారం భారీ గాలులతో కూడిన వర్షానికి పొలాల్లో కల్లాల్లో రైతులు ఆరబెట్టుకున్న మొక్కజొన్న విత్తనాలు కల్లాలో తడిసి పోయాయి. మండలంలో ద్రోణాదుల, ఇసుకదర్శినాగరాజుపల్లి, జొన్నతాళి తదిర గ్రామాలలో మొక్కజొన్న పంటను రైతులు కోశారు. వాటి విత్తనాలను పొలాల్లో కల్లాల్లో కొంతమంది ఆరబెట్టుకోగా, మరి కొంతమంది రైతులు ఇంటికి తీసుకు వచ్చి పరదాలు వేసి వాటిపై ఆర బెట్టుకున్నారు. రెండ్రోజుల నుంచి తేలికపాటి వర్షాలు కురవడం, భారీగా గాలులు వీయడంతో రైతులు అప్రమత్తంగానే ఉన్నారు. కానీ వేకువజామున అందరూ నిద్రపోయే సమయంలో భారీ గాలులతో వర్షం కురవడంతో మొక్కజొన్న రైతు లు ఉక్కిరిబిక్కిరయ్యారు. రాత్రి సమయంలో విత్తనాలను కాపాడుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వాటిని పరదాలలో వేసి ఆర బెట్టుకున్నారు. వ్యవసాయ అధికారి అంజిరెడ్డిని సంప్రదించగా గ్రామాలలో మొక్కజొన్నను కొంతమంది రైతులు మాత్రమే కోశారన్నారు. మరి కొంతమంది రైతుల పొలాల్లో ఇంకా అదేవిధంగా పంట ఉందన్నారు. అయినా తమ సిబ్బందితో గ్రామాలలో విచారిస్తామన్నారు.

సంతమాగులూరు : అకాల వర్షాలకు మిరపకాయలు తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పొలంలో ఆరబెట్టిన మిరపకాయలు తడిసిపోయాయి. ఈ ఏడాది మిరపకు గిట్టుబాటు ధర లేకపోవడం, కూలి ధరలు ఎక్కువ అవడంతో రైతులు నష్టాలబారిన పడగా, తాజాగా కురిసిన వానలు నట్టేట ముంచేస్తున్నాయి.



జలమయమైన ఈపూరుపాలెం రహదారి



ద్రోణాదులలో ఆరబెట్టిన మొక్కజొన్న విత్తనాలు



గంగపాలెంలో మొక్కజొన్న కల్లాల్లో వాన నీరు

జాగ్రత్తలతోనే అగ్నిప్రమాదాల నివారణ

అద్దంకి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చిన్న చిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని అద్దంకి అగ్నిమాపక అధికారి వెంకట్రావు అన్నారు. మూడోరోజు వారోత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలోని శ్రీనగర్ లోని శ్రీలక్ష్మీ రెసిడెన్సీలో అగ్ని ప్రమాదాల నివారణపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ వంట గదులలో చిన్న చిన్న ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి పడకుండా జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదం నుంచి బయటపడవచ్చన్నారు. గ్యాస్ సిలిండర్ లీకైనట్లు అనుమానం వస్తే కరెంట్ స్విచ్‌లు వేయవద్దన్నారు. 10 వార్డు కౌన్సిలర్ సుధీర్, లీడింగ్ ఫైర్ మాన్ చంద్రశేఖర్, రమణయ్య, కోటేశ్వరరావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

చీరాల : అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు భయపడకుండా నియంత్రణపై దృష్టి సారించాలని చీరాల అగ్నిమాపక కేంద్రం అధికారి రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని పలు అపార్ట్‌మెంట్స్, వార్డుల్లో ప్రమాదాలపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



ప్రజా దర్బార్‌లో అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే పాల్గొని సమస్యలపై ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. 219 అర్జీలు రాగా, అందులో నివేశన స్థలాలు 134, పెన్షన్ 70, రేషన్‌కార్డులు 10, మరో ఐదు ఇతరవి ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందిన అర్జీలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు వివరించారు. ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కౌతవరపు జనార్దనరావు, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వేలో పారదర్శకత పాటించండి

తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దత్త క్షేత్రం, రోశయ్య కాలనీ, చేనేత కాలనీల్లో సర్వే నిర్వహిస్తున్న ప్రత్యేక బృందాలు పారదర్శకంగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ పార్వతి సూచించారు. బుధవారం నుంచి ఆ మూడు ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు సర్వే ప్రారంభించాయి. తహసీల్దార్ పార్వతి సర్వే తీరును పరిశీలించారు. స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. మొత్తం 2వేల పట్టాలు పరిశీలించ నుండగా తొలిరోజు 680 పట్టాలను పరిశీలించినట్లు తహసీల్దార్ తెలిపారు.



ఇంటి పత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ పార్వతి

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

బల్లికురవ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించేలా అవగాహన కల్పించాలని మార్టూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ఏడీఏ కె.శ్రీనివాసరావు కోరారు. బుధవారం బల్లికురవ వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళికపై అన్ని గ్రామాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ సంఘాల అధ్యక్షులకు మండల స్థాయి శిక్షణ ఇచ్చారు. ఏడీఏ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో గ్రామాలలో అందుబాటులో ఉండే పలు రకాల వస్తువులతో పంటలు సాగు చేసేలా యాక్షన్ ప్లాన్ తయారు చేసి, రైతులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో కుమారి, వెలుగు ఏపీఎం రాజారావు, మాస్టర్ ట్రైనర్ అప్పారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి పాల్గొన్నారు.

వేటపాలెం(చీరాల): ప్రస్తుత పరిస్థితులలో అధిక సంఖ్యలో ప్రజలు అనారోగాల బారిన పడుతున్నారని ఈక్రమంలో ప్రకృతి సేద్యంతో జీవన మనుగడ సులువుగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి వై రామకృష్ణ, ప్రకృతి వ్యవసాయాధికారి వాణిశ్రీ అన్నారు. వ్యవసాయాధికారి కాశీవిశ్వనాథ్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎపీఎం అంజిబాబు, భారతి పాల్గొన్నారు.

20న ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

బల్లికురవ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలమవారిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయస్వామి వారి వార్షిక తిరునాళ్ల ఈ నెల 20వ తేదీన ఆదివారం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. టీడీపీ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పోలీసు శాఖ అనుమతులు పొంది విద్యుత్ ప్రభ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

డ్రాపౌట్స్‌ను పాఠశాలలో చేర్పించండి

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మధ్యలో స్కూల్ మానేసిన డ్రాపౌట్స్ పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించడంతోపాటు మీ పిల్లలను యూకేజీలో చేర్పించాలని ఎంఈవో చిలుకూరి గోపి అన్నారు. బుధవారం యద్దనపూడిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో ఎంపీడీవో లక్ష్మీనారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో గోపి మాట్లాడుతూ బడికి పిల్లలు అందరూ వచ్చే విధంగా చూడాలన్నారు. సమావేశంంటల సీడీపీవో సుభద్ర, ప్రధానోపాధ్యాయుడు దేవేంద్రరావు, వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే దళితుల అభివృద్ధి

పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సురేష్

పర్చూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : దళితుల అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బేతపూడి సురేష్ అన్నారు. ఎస్సీ ఉప వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయానికి పార్టీ కట్టుబడి ఉందని చెప్పేందుకు వర్గీయరణకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నిదర్శనమన్నారు. కార్యక్రమంలో గద్దె అశోక్, లక్కిపోగు సుమన్, తమ్మలూరి అశోక్, కట్టెంపూడి డేవిడ్, బాబూరావు, మోషే, వీరయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రొఫైల్స్‌ను సిద్ధం చేయాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పాఠశాలలోని విద్యార్థి ప్రొఫైల్ సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని చీరాల డిప్యూటీ ఈవో డీ గంగాధరరావు సూచించారు. బుధవారం అద్దంకిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం హెచ్‌ఎం డీఎస్ పద్మావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ ఈవో మాట్లాడుతూ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి తరువాత తరగతికి ప్రమోట్ చేసే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి అడ్మిషన్ క్యాంపెయిన్ నిర్వహించి 21వ తేది నుంచి తరగతిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల పునఃప్రారంభం నాటికి ఆపార్ ఐడీ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

అద్దంకి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో నిందితులను పోలీస్‌లు అరెస్ట్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఎదురు కొత్తపేట రోడ్డులో పల్లబోతు రోశమ్మ ఇంట్లోని బడ్డీ కొట్టులో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను బుధవారం పోలీస్‌లు అరెస్ట్ చేశారు. సోమవారం రాత్రి రోశమ్మ బడ్డీ కొట్టులో ఇందిరానగర్‌కు చెందిన షేక్ గఫూర్, షేక్ మహ్మద్ రఫీ చోరీకి పాల్పడ్డారు. గఫూర్, మహ్మద్ రఫీని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.12 వేలు, 5 గ్రాముల చెవి కమ్మలు, సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పంగులూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు క్రమం తప్పకుండా పౌష్టిక ఆహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కొరిశపాడు సీడీపీవో కృష్ణకుమారి సూచించారు. పంగులూరు ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మూడు మండలాల స్థాయిలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారం తిన్న గర్భిణులు ఆరోగ్యవంతులైన శిశువులకు జన్మనిస్తారని తెలిపారు. పుట్టిన బిడ్డకు తల్లి పాలు క్రమం తప్పకుండా ఇవ్వాలని ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు.

మంత్రి లోకేష్‌తో ఎమ్మెల్యే ఏలూరి భేటీ

పర్చూరు అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ

పర్చూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో ఏమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి, సంక్షేమం, పర్చూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, పార్టీ నిర్మాణం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ఈసందర్భంగా లోకేష్ మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలన్నారు. అందుకు అవసరమైన సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఏలూరి తెలిపారు. చినగంజాం మోటుపల్లి సముద్ర తీర ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, ఓడల తయారీ పరిశ్రమ, నేషనల్ హైవేలను కలుపుతూ జాతీయ రహదారులు, నూతన మార్కెట్ యార్డుల నిర్మాణం, రెవెన్యూ డివిజన్ కార్యాలయం, ఆటోనగర్ నిర్మాణం తదితర అంశాలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు.



మంత్రి లోకేష్‌తో ఎమ్మెల్యే ఏలూరి

శ్రీచైతన్య విద్యార్థులను అభినందించిన ఏలూరి

మార్టూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ 2024-25 పరీక్షా ఫలితాలలో శ్రీచైతన్య మార్టూరు బ్రాంచి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దాంతో వారిని బుధవారం స్కూల్ ఉపాధ్యాయులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి తీసుకొచ్చారు. అక్కడ ఎమ్మెల్యే చేతులుమీదుగా విద్యార్థులకు బహుమతులను అందజేశారు. 6వతరగతి విద్యార్థి షేక్ రయాన్ మస్తాన్ గ్రాండ్ ప్రైజ్‌గా లాప్ టాప్‌ను, 4వతరగతి విద్యార్థి మహేష్‌కు ట్యాబ్‌ను అందజేశారు.

ఉత్తమ చదువులతో ఉన్నత శిఖరాలు

చీరాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమంగా విద్యాభ్యాసం సాగించడం వలన ఉన్నత శిఖరాలను అందుకుంటారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.స్నేహలత పేర్కొన్నారు. ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన దాత్రిశ్రీ, అనూష, బ్లెస్సీ భావన రామేశ్వరిని అభినందించారు.

చెత్త నుంచి సంపద తయారీపై దృష్టి సారించండి

కొత్తపేట(చీరాల), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపద తయారీపై సిబ్బంది కచ్చితంగా అవగాహన పొందాలని డీఎల్‌పీవో శివన్నారాయణ అన్నారు. బుధవారం వేటపాలెం మండల పరిధిలోని కొత్తపేట పంచాయతీ కార్యాలయంలో మండలంలోని తొమ్మిది పంచాయతీల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేష్, ఈవోఆర్డీ అన్నం శ్రీనివాసరావు, సెక్రటరీ రమేష్, మండల పరిధిలోని కార్యదర్శులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు బస్టాండ్‌ను పరిశీలించిన ఆర్టీసీ ఈడీ

ఇంకొల్లు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు బస్టాండ్‌ను నెల్లూరు జోన్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు నాగేంద్రప్రసాద్ బుధవారం పరిశీలించారు. ప్రయాణికుల సంఘ అధ్యక్షుడు మోహనకృష్ణ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్, శ్రీశైలం, బెంగళూరుకు బస్సు సర్వీసులు నడపాలని, గుంటూరు-పర్చూరు పల్లెవెలుగు బస్సులను ఇంకొల్లు వరకు పొడిగించాలని, నైట్‌హాల్ట్ బస్సులను తిప్పాలని విన్నవించారు. పావులూరు రోడ్డులోని డిపో స్థలాన్ని నాగేంద్రబాబు పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఎం రవికాంత్, చీరాల డీఎం శ్యామల, సివిల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, కంట్రోలర్ బాబు ఉన్నారు.

పందిళ్లపల్లిలో గ్రామసభ

పందిళ్లపల్లి(చీరాల), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పందిళ్లపల్లి పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ మాల్యాద్రి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలతో గ్రామ సభ నిర్వహించారు. ఈకేవైసీ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

అధికారులతో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్దేసించిన విధుల్లో భాగంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని 10 మండలాలకు చెందిన తహసీల్దార్‌లు, హౌసింగ్, ఇరిగేషన్, రీసర్వే సిబ్బందితో బుధవారం ఆర్డీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇప్పటికే సేకరించిన నివేశన స్థలాల అర్హుల జాబితాను అందజేయాలని సూచించారు. హౌసింగ్‌కు అర్హుల జాబితాపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే నీటి పన్ను వసూళ్లపై ఆరా తీ శారు. సేకరించిన డేటాను ఎప్పటికప్పుడు కార్యాలయానికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేద్దాం

పంగులూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మడల అభివృద్ధికి పాటుపడాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన జరిగింది. ఎంపీడీవో స్వరూపారాణి మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాల అలమలుకు ప్రజా ప్రతినిధులు తమ సహకారం అందించాలని కోరారు. పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలను విద్యుత్ సబ్ ఇంజనీర్ ఆంజనేయులు వివరించగా, సీసీఆర్‌సీ కార్డులు పొందడం ద్వారా కౌలు రైతులకు రాయితీలు అందుతాయని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు. వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా నీటి ట్యాంకులను సాగర్ జలాలతో నింపే విషయంలో ప్రజా ప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది సహకరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య కోరారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు ప్రమీల, పీ హెచ్ సీ వైద్యాధికారి బాలరాజేశ్వరి, ఎం ఈవో వీరాంజనేయులు, పీఆర్ ఏఈ హ నుమంతరావు, ఆర్ఐ శ్వేత, పశువైద్యాధికారి మురళీకృష్ణ, ఏపీఎం జ్యోతి ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

సమస్యల ప్రస్తావనే లేదు

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

మార్టూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఉన్న ప్రజల సమస్యలను ప్రస్తావించడానికి, అధికారుల దృష్టికి తీసుకురావడానికి ఆయా గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిదులు,ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మండల సర్వసభ్య సమావేశాన్ని వేదికగా ఎంచుకుంటారు. అయితే బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో గ్రామాలలోని ప్రజల సమస్యలను సభలో మాట్లాడిన ప్రజాప్రతినిదులు లేరంటే అతిశయోక్తికాదు. మండలంలో 21 మంది ఎంపీటీసీ సభ్యులుండగా, కేవలం 9 మంది మాత్రమే హాజరుకాగా, సర్పంచ్‌లు ముగ్గురు హాజరయ్యారు. ఏ గ్రామ సమస్యపైనా అడిగే వారు లేరు. ఇక అధికారులు కూడా ఆయా శాఖలకు చెందిన వివరాలను మొక్కుబడిగా చదివి వెళ్లిపోయారు. ఎంపీపీ భూక్యా శాంతిబాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ 2025-26కు సంబంధించి అభివృద్ధి పనులు, మంజూరుకు సంబంధించి ప్రణాళికను పంపాల్సిందిగా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లను కోరారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ విష్ణుతేజ మాట్లాడుతూ ఆస్పత్రి ఆవరణలో సీసీ రోడ్డు మంజూరుచేయాలని, గ్రామ పంచాయతీ వారు మంచినీటి వసతి పైపు లైనును ఏర్పాటుచేయాలని కోరారు. హౌసింగ్ సూపర్‌వైజర్ హరి మాట్లాడుతూ మండలంలో 695 మంది ప్రభుత్వ పక్కాగృహాలు నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నారని, వారికి సబందించిన కుల,ఆదాయ,ప్రొవిజనల్ సర్టిఫికెట్లను పంపించేవిధంగా చూడాలని ప్రజా ప్రతినిధులను కోరారు.



మాట్లాడుతున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ విష్ణుతేజ